

అరె..టి మేళా భళా?

అరె అరటిలో ఇన్ని రకాలు ఉన్నాయా.. చూస్తుంటే కొత్తగా ఉందే.. అవును మరి అరటిలో రకాల గురించి అడిగితే ఎవరైనా సరే ఒకటో రెండో రకాలు చెబుతారు.. ఇక్కడ చూడండి ఎన్ని రకాలు ఉన్నాయో.. కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్ మేళా నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని రకాల అరటి ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు.. అరటి రకాలను చూసి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆశ్చర్యపోయారు. అంతే కాదండోయ్ కంద, చేమ, పసుపు ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు.. పెద్దఎత్తున శాస్త్రవేత్తలు, రైతులు తరలివచ్చారు.

6

కాకినాడ కోర్ట్ నుంచే..!

ఈ అమ్మాయి ఎవరో గుర్తుపట్టారా? ఈమె ఏమైనా సెలబ్రిటీనా గుర్తుపట్టడానికి అంటారా..! అవును సెలబ్రిటీనే.. ఎక్కడా మేం చూడలేదే అంటారా.. అయితే ఇటీవల విడుదలై హిట్ సాధించిన 'కోర్ట్' సినిమా చూడండి.. గ్యారంటీగా గుర్తుపడతారు.. ఎందుకంటే అందులో హీరోయిన్‌గా నటించిన శ్రీదేవి మన కాకినాడకు చెందిన అమ్మాయే.. అదృష్టం ఎవరికి ఏ రూపంలో వస్తుందో ఊహించలేమంటారు కదా.. ఈమెకు అంతే.. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసుకునే అమ్మాయి.. ఒక్కసారిగా హీరోయిన్‌గా మారిపోయింది.. హీరో నాని నిర్మాతగా తీసిన కోర్ట్ సినిమాలో అవకాశం దక్కింది. తొలి సినిమాతోనే హిట్ కొట్టింది.. ఈ సందర్భంగా ఆమెను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా పలు విషయాలు చెప్పుకొచ్చింది..

6





కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలుసుకున్న డీఆర్డీఏ పీడీ జయచంద్ర

డీఆర్డీఏ పీడీగా జయచంద్ర

అమలాపురం టౌన్/ముమ్మిడివరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) పీడీగా టి.సాయినాథ్‌జయచంద్ర(గాంధీ) బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకుని జాయినింగ్ రిపోర్టును అందజేశారు. విజయవాడ డివిజన్‌లో అదనపు పథక సంచాలకులుగా పనిచేస్తున్న జయచంద్రను కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పీడీగా పనిచేసిన డాక్టర్ వి.శివశంకరప్రసాద్‌ను కేంద్ర కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో సాయినాథ్‌జయచంద్ర నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన జయచంద్రను సెర్ప్ ఉద్యోగులు, జిల్లా యూనియన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు దేవ వరాలబాబు, కార్యదర్శి ముత్తా బత్తుల వెంకటేశ్వరరావు, కోశాధికారి భూపతి వర్మ, మహిళా విభాగ నాయకులు పాటి వెంకటరమణ, శ్రీను, మురళీ, పైడితల్లి, వెంకటలక్ష్మి ఉన్నారు.

జిల్లాలో పోలీసు, అగ్నిమాపక సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు

అమలాపురం, మార్చి22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పోలీసు, అగ్నిమాపక సర్వీసుల్లో పనిచేస్తూ వివిధ హోదాల్లో ఉన్న సిబ్బందికి 2025 ఉగాది సేవా పురస్కారాలను ప్రకటించింది. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పలువురు పోలీసు, అగ్నిమాపక సిబ్బందికి పతకాలు లభించాయి. ఆర్ఎస్ఐ బి.త్రినాథరావుకు, హెడ్ కానిస్టేబుల్ డీఎస్‌బీలో విధులు నిర్వహిస్తున్న కె.తిరుపతిరాజుకు ఉత్తమ సేవా పతకం, సఖినేటిపల్లి మండలం అంతర్వేదికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ రామకృష్ణారావుకు ఉత్తమసేవా పతకం లభించింది. అలాగే అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పి.వీరబాబుకు, అంబాజీపేట ఏఎస్ఐ వై.సూర్యనారాయణ, ఐ.పోలవరం హెచ్‌సీ సీహెచ్ మురళీకృష్ణ, ఏఆర్ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఏఆర్‌హెచ్‌సీ కె.రత్నాకర్‌రావులకు ఉత్తమ సేవా పతకాలు లభించాయి. రాజోలు ఫైర్‌స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న జి.రామకృష్ణకు ఉత్తమ సేవా పతకం లభించింది.

ఆ నాన్నకు పిల్లలను చంపాల్సిన అవసరం ఎందుకొచ్చింది..? ఆ దంపతులకు ఊపిరి తీసుకునేంత కష్టం ఎందుకొచ్చింది..? మరో యువకుడి బలవన్మరణానికి కారణం ఏంటి..? ఈ ప్రశ్నలన్నింటి వెనుక ఉన్నది ఒక్కటే జవాబు అదే అప్పు.. ఆ నాన్న తను లేకపోతే తన పిల్లలను ఎలా చూస్తారోననే భయంతో తన కంటిని తానే పొడుచుకున్నాడు.. క్షణికావేశంలో కుమార్తెను బలి తీసుకున్నాడు.. జైలు పాలయ్యాడు.. కాకినాడకు చెందిన దంపతులు ఇంటిని నిర్మించి అప్పుల పాలయ్యారు.. ఆ ఇంటిని అమ్మేసినా అప్పులు తీరక గోదావరిలో దూకి తనువు చాలించారు.. కోనసీమ జిల్లా బండార్లంకకు చెందిన బాగా బతికిన ఒక కుటుంబం అప్పులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.



మరణాలు!

దారుణంగా చితికిపోతున్న బతుకులు

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఆర్థికంగా చితికిపోయి.. తమ చితిని తామే పేర్చుకొని లోకం విడిచి వెళ్లిపోతున్న వాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఇవాళ అత్యంత ఆందోళన కలిగించే అంశం. అప్పు అనే రెండక్షరాల ఊబి నుంచి బయటపడే అవకాశాలు కానరాక బలవంతంగా ఊపిరి తీసుకుంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులు.. సంపాదనకు ఉన్న వ్యత్యాసం ఉసురుతీస్తోంది. నెలంతా కష్టపడితే ఖాతాలో పడే జీతం మూడు రోజుల్లో ఆవిరి అయిపోతూ.. మా మాటేమిటంటూ 27 రోజులు ప్రశ్నిస్తుండడం నడుమ పేద, మధ్యతరగతి జీవితాలు నలిగిపోతున్నాయి. పిల్లలను చంపి, తామూ చావడానికి ధైర్యం కూడగట్టుకుంటున్నారంటే మరణాలను రుణాలు శాసిస్తున్నాయనే వాస్తవం పదేపదే రుజువు అవుతూనే ఉంది. అప్పులు లేని పేద, మధ్య తరగతి జీవులు భూతద్దం పెట్టి వెతికినా ఒక్కరూ కానరాని రోజులు నడుస్తున్నాయి. ఓ పదేళ్ల కిందట ఆత్మహత్యలు చాలా తక్కువ. ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ఏ కారణాలు చెప్పుకొన్నా ఆర్థిక ఇబ్బందులే అసలు రుగ్మత అనేది ఏవరూ కాదనలేని వాస్తవం. గతంతో పోలిస్తే ఈరోజు పిల్లల స్కూలు ఫీజుల దగ్గర నుంచి ప్లాట్‌ఫాంపై అమ్మకాలు సాగించే అరటి పండ్లతో సహా సుమారు 200 నుంచి 500 శాతం వరకూ ధరలు పెరిగిపోయాయి. నిత్యావసరాలు అంతే. దీంతో మనుగడకు అప్పులు తప్ప వేరే దారి కానరావడం లేదు. గతంలో కుటుంబ కలహాలు ఎక్కువగా ఉసురుతీస్తే ఇవాళ ఆ స్థానాన్ని ఆర్థిక ఇబ్బందులు భర్తీ చేస్తున్నాయి. ఒకప్పుడు ఇల్లు కట్టుకున్నా, కూతురు పెళ్లి చేసినా అప్పులు తప్పవని చెప్పేవారు. ఇవాళ స్కూలు ఫీజు కట్టాలంటే రుణాలకు వెళ్లక తప్పడంలేదు. పోలీసు రికార్డుల ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో గత ఏడాది 230 మంది, జనవరిలో 30 మంది, ఫిబ్రవరిలో 20 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. అసలు రికార్డులకు ఎక్కనివి ఇంకో అన్ని ఉంటాయని చెబుతున్నారు. ఈ మరణాల్లో సుమారు 70 శాతం మందిని ఆర్థిక ఇబ్బందులే చంపేశాయని తెలుస్తోంది. నెలకు రూ.20 వేల నుంచి రూ. 30 వేలు వస్తున్నా నెలాఖరున అప్పులు చేయాల్సిన పరిస్థితి.

ఎందుకు చంపావ్ నాన్నా..



రాయవరం : తన కంటిని తానే ఎవడైనా పొడుచుకుంటాడా.. ఈయన అదే చేశాడు.. కన్న పిల్లలనే కాలువలో తోసేశాడు..అయితే కుమార్తె మృతిచెందగా...కుమారుడు బయటపడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరుకు చెందిన పిల్లి రాజు ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఎంతో బాగా బతికాడు.. గ్రామంలో అందినకాడికి అప్పులు చేయడంతోపాటు కొంతకాలం కిందట ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో రొటేషన్ ఆగిపోయింది.. మరోవైపు అప్పులిచ్చిన వారి ఒత్తిడి పెరిగిపోవడంతో చనిపోదామని నిర్ణయించుకున్నాడు.. తను చనిపోతే తన పిల్లల పరిస్థితేంటని ఆలోచించాడు. ఈనెల 17న పిల్లలను తీసుకెళ్లి కాలువలో నెట్టేశాడు.. కుమార్తె మృతిచెందగా కుమారుడు బయటపడ్డాడు. చనిపోదామనుకున్నా ధైర్యం సరిపోలేదు. బంధువుల ఇంటికి వెళ్లగా వారు మందలించడంతో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. క్షణికావేశంలో తీసుకున్న తొందరపాటు నిర్ణయం పచ్చని కుటుంబంలో తీరని శోకం మిగిల్చింది. ఏడేళ్ల అల్లారు ముద్దుగా పెంచి ఎందుకు ఆయువు తీశావు నాన్నా.. అంటూ చిన్నారి ఆత్మ ఘోషిస్తోంది.

అప్పులు తీర్చాలని అర్జీలు

కాకినాడలో ఓ పేద కుటుంబానికి చెందిన ఓ వివాహిత తన కుమార్తె వివాహానికి రెండక్షరాలున్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ వద్ద ఇంటిని తాకట్టు పెట్టి రూ.15 లక్షల రుణం తీసుకుంది. ఆ మొత్తాన్ని చెల్లించలేకపోవడంతో ఇంటి జప్తునకు సదరు కంపెనీ నోటీసులు పంపింది. లబోదిబోమన్న ఆమె కంపెనీని వేడుకున్నా కనికరించలేదు. దీంతో ఈనెల 17న గ్రీవెన్స్‌లో కాకినాడ జిల్లా జేసీని కలిసి ప్రభుత్వం ద్వారా తన అప్పు తీర్చాలని వేడుకుంది. అవాక్కయిన జేసీ, లీడ్‌బ్యాంకు మేనేజర్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులను పిలిచి కొంత సమయం ఇవ్వాలని కోరినా వినకుండా మహిళ ఇంటిని జప్తు చేసేసుకుంది. దీంతో సదరు మహిళ నిలువనీడ కోల్పోయి తీవ్రంగా సతమతమవుతోంది.. ఇలా ఈమే కాదు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి బతకలేక.. బతుకుబండి ఈడ్చలేక నరకయాతన పడుతున్నాయి. తమ ఆర్థిక భారాన్ని ప్రభుత్వం తీర్చు తుందేమోననే అమాయకపు ఆశతో కొందరు జీవిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు పలు అర్జీలు రావడమే నిదర్శనం. ఈ తరహా విజ్ఞప్తులు పిఠాపురం నియోజకవర్గం నుంచి భారీగా వెళ్లడంతో ఆమధ్య డిప్యూటీ సీఎం పవన్ సైతం అప్పులు తీర్చాలంటూ జనం విజ్ఞప్తి లేఖలు రాయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అనవసర ఆర్భాటాలతోనూ..

దురాశ.. దుఃఖానికి చేటు అనే విషయాన్ని జనం గుర్తించకపోవడం మరో కారణం. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టుగా.. ఎదుట వ్యక్తి సంపాదించేస్తున్నాడు. మనం కూడా ఏదో ఒక రకంగా సంపాదించాలి. ఖరీదైన బైక్‌లు కొనేయాలి. లగ్జరీ కార్లలో తిరిగేయాలనే అత్యాశకు, అనవసర బిల్డప్‌కు పోయి కొందరు చిక్కులు తెచ్చుకుంటున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు యువత వ్యసనాలకు బానిసవుతున్నారు. బెట్టింగ్, ఇతరత్రా జూదక్రీడలకు అలవాటు పడుతున్నారు. వీటిలో సంపాదించింది గోరంతైతే.. పోగొట్టుకునేది కొండంత. స్టాక్ మార్కెట్లు, షేర్లలో డబ్బులు పెట్టిన వారు ఎందరో నష్టాల బారినపడుతున్నారు. ఇవన్నీ బయటకు చెప్పుకోలేక లోలోపల సతమతవుతున్నారు. చేసిన అప్పులకు వాయిదాలు కట్టలేక కొత్త అప్పులు చేస్తున్నారు. ఇలా అప్పుల మీద అప్పులు చేసి కొందరు చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు.

- ఆదాయాన్ని మించి ఖర్చులు
- అనవసర ఆడంబరాలు
- పెరుగుతున్న అప్పులు
- నలిగిపోతున్న జనం
- తీర్చలేక బలవన్మరణాలు
- కుటుంబాలూ బలి
- బ్యాంకు రుణాలు అధికమే
- జిల్లాలో రూ.91 వేల కోట్లు
- వ్యక్తిగతం రూ.13 వేల కోట్లు
- ప్రైవేటు అప్పులు అదనం

ఆర్థికంగా అగచాట్లు..

కొవిడ్ 19 తర్వాత చాలా మంది ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి. కొన్నిచోట్ల పరిశ్రమలు మూతపడడం, చాలామంది ఉద్యోగాలు పోవడం.. చేసేందుకు పని కూడా దొరకని పరిస్థితి. చేసిన అప్పులు తీర్చలేక.. కొత్త అప్పు పుట్టక నానాయాతనపడ్డారు. మరోవైపు ఇదే సమయంలో అప్పులు ఇచ్చే ఫైనాన్షియర్లు కూడా సరైన హామీదారులు ఉంటేనే అదీ కూడా బాగా తెలిసిన వారైతేనే రుణాలు ఇస్తుండడంతో చాలా మంది ఆర్థిక అగచాట్లు పడుతున్నారు. మరోవైపు బ్యాంకులు కూడా సిబిల్ స్కోర్ బాగుంటేనే లోన్లు మంజూరు చేస్తుంటే.. అవీ సరిగా లేని సామాన్యులు నలిగిపోతున్నారు.

ఉమ్మడి జిల్లా బ్యాంకుల్లో రుణాలు రూ.91,089 కోట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది కుటుంబాలు పలు కారణాలతో బ్యాంకుల వద్ద వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. ఇది కాకుండా ఫైనాన్స్ కంపెనీలు, బంగారంపై రుణాలు ఇచ్చే సంస్థలు, వ్యాపారులంతా కలిపి ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్యాంకుల బ్రాంచిల్లో రూ.91,089 కోట్ల రుణాలు తీసుకున్నాయి. కాకినాడ జిల్లాలో రూ.33,844 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.23,514 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.33,731 కోట్లు. ఈ మొత్తంలో వ్యక్తిగత రుణాలు రూ.13 వేల కోట్లు పైనే. పేద, మధ్య తరగతి కుటుంబాలు బ్యాంకుల కంటే తాకట్టు, వడ్డీ వ్యాపారులు, ప్రైవేటు ఫైనాన్స్‌ల నుంచి తీసుకుంటున్న అప్పులే అధికమని.. ఆర్థిక సమస్యల్లో చిక్కుకుని ఆత్మహత్యల వరకు వెళుతున్న అనేక కుటుంబాల గురించి కాకినాడ జిల్లా బ్యాంకింగ్ నిపుణులు విశ్లేషించడం గమనార్హం.

బతుకు జీవుడా..!

కాకినాడ రూరల్ మండలానికి చెందిన నితీష్ మెడికల్ రిప్‌గా పనిచేసేవాడు.. వచ్చిన ఆదాయం సరిపోక అక్కడక్కడా అప్పులు చేశాడు.. చివరకు తన ఇంటిపై బ్యాంకులో లోన్ పెట్టి చిన్నచిన్న అప్పులు తీర్చేసి.. మిగిలిన సొమ్ముతో మెడికల్ బిజినెస్ చేశాడు. అయినా లాభంలేదు. ఓ పక్క బాకీదారుల ఒత్తిళ్లు, మరోపక్క పూటగడవని పరిస్థితులు.. కుటుంబమంతా కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. తర్వాత తమకున్న ఇంటిని అమ్మితే గట్టెక్కవచ్చని ఆలోచించారు. సొంతింటిని అమ్మేసి అప్పులు తీర్చేశారు. సామర్లకోట మండలం మాధవపట్నానికి చెందిన నరేంద్ర డిగ్రీ వరకు చదివి ఉద్యోగం కోసం కాకినాడ గాంధీ నగర్‌కు చెందిన వెంకటేశ్వరరావుకు అప్పులు చేసి రూ.5 లక్షల వరకు సమర్పించాడు. ఒకసారి ఢిల్లీలో ఇన్‌కంటాక్స్ ఆఫీసులో ఉద్యోగం అని.. రెండోసారి రాష్ట్ర రాజధాని అమరావతి సెక్రటేరియేట్‌లో ఉద్యోగం చూశానని మోసగించాడు. ఓపక్క ఉద్యోగం పేరుతో మోసపోవడం, అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో ఆత్మహత్యే శరణ్యమని భావించి చివరికి పోలీసులను ఆశ్రయించాడు. వీరేకాదు.. ఎంతో మంది ఆర్థిక పరిస్థితులు తలకిందులై అనేక మంది బతుకు జీవుడా అని కాలం వెళ్లదీస్తున్నారు. కొవిడ్ తర్వాత సగటు జీవిబతుకు చిత్రం పూర్తిగా మారింది. చాలీచాలని వేతనాలు.. పెరుగుతున్న ధరలు అగాధంలోకి నెట్టేస్తున్నాయి.



గుత్తెనదీవిలో ఈనిక దశలో నీరందని చేలు

ఈనిక దశలో.. నీటికి కటకట!

- కాల్వ శివారు భూములకు అందని సాగునీరు
- ప్రస్తుత దశలో పంటలకు నష్టమని రైతుల ఆందోళన
- వంతులవారీ విధానమున్నా ఎద్దడే
- నీటి చౌర్యాన్ని అరికట్టి ఆదుకోవాలి : అన్నదాతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రబీ సేద్యం చివరి దశకు చేరుకున్న తరుణంలో సాగునీటి సమస్య ఉత్పన్నమవుతుండడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రబీ పంట ఈనిక దశలో ఉన్న సమయంలో కాల్వ శివారు భూములకు సాగునీటిఎద్దడి ఉత్పన్నం కావడం వల్ల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందనేది వారి ఆవేదన. జలవనరుల శాఖ అధికారులు వంతులవారీ విధానాన్ని మధ్యమధ్యలో ఇంజన్ల ద్వారా సాగునీటిని కొబ్బరితోటలు, చెరువులకు మళ్లించడం వల్ల కాల్వ శివారు భూములకు సాగునీరు అందడం లేదనేది రైతుల ప్రధాన ఆరోపణ. ఇప్పటికే క్రాస్ బండ్‌లు నిర్మించి నీటిని నిల్వ చేసుకుంటే ఏప్రిల్ నెల వరకు కొంతమేర రైతులకు మేలు జరిగేదని పేర్కొంటున్నారు. కోనసీమ జిల్లా పరిధిలో కొన్ని ప్రాంతాల్లో కాల్వ శివారు భూములకు ఇటీవల నీటి ఎద్దడి ఉత్పన్నమైంది. దీనిపై ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కారంపై అధికారులు దృష్టి సారించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అయితే వంతులవారీ విధానాన్ని అమలుచేయడంలో అధికారులు పాటిస్తున్న కొన్ని నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారాయి. లాకుల వద్ద నీటిని తగ్గించేసి వంతులవారీ విధానం అమలులోకి వచ్చినప్పుడు నీటిని విడుదల చేయడం వల్ల ఈ నీరు ప్రస్తుతం ఎండలకు కాల్వల్లో ఇంకిపోయి పూర్తి స్థాయిలో శివారు భూములకు అందడం లేదు. ఉదాహరణకు కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలంలో అయినాపురం, సూరాయిచెరువు, ముమ్మిడివరం, కాల్వ శివారు ప్రాంతాల్లో మెరక పొలాలకు నీటిఎద్దడి ఉంది. అదేవిధంగా పి.గన్నవరం మండలం ముంగండ శివారు ఇటుకల మెరక, కొంపటిప్పార్ర, రాజులపాలెం ప్రాంతాల్లో నీటిఎద్దడి ఉన్నప్పటికీ రైతులు సొంత ఖర్చులతో ఆయిల్ ఇంజన్ల సాయంతో నీటిని తోడుకుంటున్నారు. అదేవిధంగా ఐ.పోలవరం మండలంలో జి.వేమవరం, జి.మూలపొలం, గుత్తెనదీవి, ఎర్రగరువు, టి.కొత్తపల్లి, తిల్లకుప్ప గ్రామాల శివారు భూములకు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఇటీవల కె.గంగవరం మండలం పేకేరు, పామర్రులలో నీటి ఎద్దడి ఉత్పన్నమైనప్పటికీ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో కొంతమేర సమస్యను పరిష్కరించారు. కాగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి ఉత్పన్నమైన ప్రాంతాలపై ఇరిగేషన్, డ్రైన్స్‌శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు నివేదిక అందజేశారు. రాజోలు మండలంలో సుమారు 70 ఎకరాలు, అమలాపురం మండలంలో 96 ఎకరాలు, ఉప్పలగుప్తం మండలంలో వంద ఎకరాలు, అల్లవరంలో 80 ఎకరాలు, మామిడికుదురులో 100 ఎకరాల్లో నీటిఎద్దడి ఉన్నట్టు అధికారులు నివేదిక ఇచ్చారు. ఇక్కడ సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. శివారు భూములకు నీరందించే సమయంలో మధ్యలో సాగునీటి చౌర్యం లేకుండా చర్యలు తీసుకుని పంటలను రక్షించాలని అన్నదాతలు కోరుతున్నారు.

క్రాస్ బండ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

ఏప్రిల్ 15 వరకు సాగునీటి సరఫరా పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

అమలాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో కాల్వ శివారు భూములకు సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఇరిగేషన్, డ్రైనేజీశాఖ అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో వివిధ ప్రాంతాల్లో క్రాస్ బండ్‌లు ఏర్పాటుచేసి రైతులకు సాగునీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్, డ్రైన్స్, వ్యవసాయశాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. సాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, వ్యవసాయశాఖ, జలవనరుల శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలని, క్షేత్రస్థాయిలో ఏఈలు, ఏవోలు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. క్రాస్ బండ్‌లు వేసి ఆయిల్ ఇంజన్లతో సాగునీటి సరఫరా చేస్తూ సాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలన్నారు. ఏప్రిల్ 15వరకు సాగునీటి సరఫరా పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చివరి ఎకరం వరకు సంపూర్ణంగా సాగునీరు అందించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు దేవరకొండ అఖిల, కె.మాధవి, పి.శ్రీకర్, ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లకు దరఖాస్తుల గడువు 25 వరకు పొడిగింపు

అమలాపురం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపులు, ఇతర యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్టు జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. జనరిక్ మెడికల్ షాపులు, మేదర, కుమ్మరి, శాలివాహన యూనిట్లు, ఎంఎస్ఎంఈ యూనిట్లకు ప్రభుత్వ సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కాపు సామాజికవర్గం వారు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వయసు 21 నుంచి 50 సంవత్సరాలుగా గతంలో ఇచ్చిన వయో పరిమితిని 60 సంవత్సరాలకు పెంచారన్నారు. అర్హత కలిగిన బీసీ, కాపు, వైశ్య, రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, ఈబీసీ వర్గాలకు చెందినవారు 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



జలనవరుల ఆవశ్యకత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం : కలెక్టర్

అమలాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. జల వనరుల భద్రతతోనే భవిష్యత్తు తరాలు సురక్షితంగా మనగలుగుతాయన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని శనివారం కలెక్టరేట్‌లో నాబార్డు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎదురయ్యే నీటి యాజమాన్య సవాళ్లను వివరించారు. 'మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి వనరుల పరిరక్షణ' అనే అంశంపై జాతీయ జలనవరుల సంస్థకు చెందిన శాస్త్రవేత్త వై.శివప్రసాద్ తన పరిశోధనా అంశాలను వివరించారు. జిల్లా అటవీ అధికారి ఎంవీ ప్రసాదరావు మాట్లాడుతూ మడ అడవుల పరిరక్షణ, ఉప్పునీటి ప్రవాహాలతో ముప్పు తదితర అంశాలపై చర్చించారు. భవిష్యత్తులో వాతావరణంలో మార్పులు.. జలవనరులపై దాని ప్రభావం.. ఎదుర్కొవలసిన సవాళ్లు అనే అంశంపై రూపొందించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. నాబార్డు డీడీఎం డాక్టర్ వైఎస్ నాయుడు, ఎల్డీఎం కేశవవర్మ తదితరులు నీటి వనరుల ప్రాధాన్యతను వివరించారు.

కాకినాడ నాకు చాలా స్పెషల్!

కథలెన్నో చెప్పారు.. కవితల్ని రాశారు.. కాలాలు దాటారు.. యుద్ధాలు చేశారు ప్రేమలో.. తప్పు లేదు ప్రేమలో..

కొద్దిరోజులుగా ఎక్కడ విన్నా ఇదే పాట.. యూట్యూబ్, ఇన్‌స్టా, రీల్స్.. ఇలా ఏ సోషల్ మీడియాలో చూసినా ఇదే పాటలో వేసిన స్టెప్పుల మోతే.. 'కోర్ట్' సినిమాలో ప్రధాన ఆకర్షణగా అందులో నటించిన యువజంట నిలిచారు. ట్రెండింగ్‌లో రికార్డులు బద్దలుకొట్టారు. ఈ యువజంటలో హీరోయిన్‌గా నటించిన శ్రీదేవి అప్పల సొంతూరు కాకినాడే. సర్పవరంలో ఉండే ఈ టీనేజ్ అమ్మాయితో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' జరిపిన చిట్‌చాట్...

'కోర్టు' చిత్రం హీరోయిన్ శ్రీదేవితో చిట్‌చాట్

ప్రశ్న: హాయ్ అండి.. ఎలా ఉన్నారు..

జవాబు : బాగున్నాను అండీ.

ప్ర: మీ కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి?

జ: మా అమ్మ నీలిమ అప్పల. నా జీవితానికి అతిపెద్ద స్తంభం. తను ఎప్పుడూ నాకు మద్దతుగా ఉంది. అలాగే మా అక్క ఒక పిల్లర్. ఎప్పుడూ నన్ను గైడ్ చేస్తూ, ప్రోత్సహిస్తూ ఉంటుంది. వాళ్లిద్దరి ప్రేమ, సహాయం లేకుండా నేను ఈ ప్రయాణాన్ని మొదలుపెట్టే అవకాశం ఉండేది కాదు.

ప్ర : మీది కాకినాడేనా..

జ: అవును. కాకినాడలోని సర్పవరంలో ఉంటున్నాం. శ్రీచైతన్య ఇంటర్నేషనల్‌లో టెన్త్ వరకు చదివా. శుభానికేతన్‌లో ఇంటర్. నా బాల్యమంతా కాకినాడలోనే. అందుకే కాకినాడ నాకు చాలా స్పెషల్.

ప్ర : మీ స్నేహితులు టచ్‌లో ఉన్నారా...

జ: ఎందుకు ఉండరు.. నాకు చిన్నప్పటి స్నేహితులు కూడా టచ్‌లో ఉన్నారు. వాళ్లతో కలిసి గడిపే సమయం నాకు చాలా ప్రీషియస్.



కాకినాడ బీచ్‌లో (ఫైల్)

- ఆంధ్రజ్యోతి, కాకినాడ కార్పొరేషన్



శ్రీదేవి



కోర్ట్ చిత్ర నిర్మాత హీరో నానితో అమ్మ నీలిమ, అక్క దివ్యతో శ్రీదేవి

అమ్మ చేతి వంట ఇష్టం..

ప్ర : సినీ రంగంలోకి ప్రవేశం ఎలా జరిగింది..

జ: నాకు చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉండేది. అది గమనించిన మా అక్క, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేయడానికి ప్రోత్సహించింది. కొన్ని ఆడిషన్ల తర్వాత 'కోర్టు' చిత్రం హీరోయిన్‌గా అవకాశం రావడం నాకు పెద్ద బ్రేక్.

ప్ర : మీ రెగ్యులర్ లైఫ్ స్టైల్ ఎలా ఉంటుంది? మీ హాబీస్..

జ: నా డే స్ట్రిక్ట్ షెడ్యూల్‌లో ఉంటుంది. ఫిట్‌నెస్, డాన్స్, స్క్రిప్ట్ చదవడం అన్నీ ప్లాన్ చేస్తాను. హాబీస్‌లో ట్రావెలింగ్, మ్యూజిక్ వినడం ఇష్టం.

ప్ర : గోదావరి జిల్లాల్లో ఏ ప్రాంతాల్లో, ఏ ఫుడ్ అంటే మీకు ఇష్టం..

జ: నాకు ఇంట్లో అమ్మ వండిన వంటకాలు ఇష్టం. పూర్తిగా శాకాహారి అయిన నేను హోం కుక్‌డ్ ఫుడ్‌ను ప్రిపర్ చేస్తాను. గోదావరి జిల్లాలోని పచ్చళ్లు, ప్రత్యేకమైన వంటకాల రుచి మరుపురాని అనుభూతినిస్తాయి.

శ్రుతిహాసన్.. నాకు ఇన్‌స్పైరింగ్

ప్ర: మీ అభిమాన హీరో, హీరోయిన్లు..

జ: నాకు పవన్‌కల్యాణ్‌గారి స్టైల్, నాని గారి నేచురల్ యాక్టింగ్ చాలా ఇష్టం. హీరోయిన్లలో శ్రుతిహాసన్ వర్క్ నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది.

ప్ర: మీ డ్రీమ్ ఏంటి? ఎవరితోనైనా కలిసి వర్క్ చేయాలని ఉందా..

జ: నా డ్రీమ్ మంచి పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో ఉండాలి. డైరెక్టర్ రాజమౌళి గారి సినిమాలో నటించాలన్నది నా కల.

ప్ర: ప్రస్తుతం ఏ ప్రాజెక్టులు చేస్తున్నారు..

జ: ప్రస్తుతం కొత్త ప్రాజెక్టు అంగీకరించా. ఆ మూవీకి వర్క్ చేస్తున్నాను. త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వస్తుంది.



అక్క దివ్యతో

ఆ స్టెప్ కోసం.. పది నిమిషాలే..

ప్ర : కోర్ట్ సినిమాలో మీకు బాగా గుర్తింపు తెచ్చిన జాబిలి పాత్ర కోసం మీ అభిప్రాయం..

జ: జాబిలి పాత్ర నాకు చాలా స్పెషల్. ఆ పాత్రలో భాగోద్వేగాలను డీప్‌గా చూపించే ఛాలెంజింగ్ రోల్. ప్రేక్షకుల స్పందన నన్ను మరింత ఉత్సాహపరిచింది.

ప్ర : కోర్ట్ మూవీలో మీరు హీరోయిన్‌గా చేయడాన్ని ఎలా ఫీల్ అవుతున్నారు..

జ: ఇది నా కెరీర్‌లో ఒక గొప్ప మైలురాయి. నా మీద నమ్మకంతో ఈ పాత్రను ఇచ్చిన నానిగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. ఈ ఛాన్స్ నాకు దొరకడం, దర్శకుడి గైడెన్స్‌లో నటించడం, ప్రేక్షకుల ప్రేమ పొందడం ఇవి అన్నీ నాకు మరిచిపోలేని అనుభవాలు.

ప్ర : షూటింగ్‌లో మీకు ఏమనిపించింది.. మీతోటి యాక్టర్స్ సహకారం ఎలా ఉంది..

జ: షూటింగ్‌లో మా టీమ్ సపోర్ట్ చాలా బాగా లభించింది. నటనలో వాళ్ల నుంచి నేర్చుకోవడం ఒక మంచి అనుభవం.

ప్ర : ప్రమోషన్‌లో భాగంగా మీరు వేస్తున్న స్టెప్పు ఎన్ని రోజులు నేర్చుకున్నారు..

జ: నిజం చెప్పాలంటే ఆ స్టెప్పును నేర్చుకోవడానికి నాకు కేవలం పది నిమిషాలే పట్టింది. డ్యాన్స్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే త్వరగా గ్రాసెప్ చేసుకోగలిగాను. ఆ స్టెప్ బాగా క్లిక్ అవడంతో ప్రమోషన్‌లో భాగంగా ఆ స్టెప్ అందరితో కలిసి వేస్తున్నా.



ప్రకృతి రమణీయత



మండపేట బైపాస్‌లో..

చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టు, పర్యాటక ప్రాంతాలైన పోర్ బై జలాశయాల, సీలేరు నది పొడవునా ప్రకృతి రమణీయ దృశ్యాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. తొలి, మలి సంధ్య వేళ ఉషా కిరణాలు జలాశయాన్ని తాకినప్పుడు ప్రకృతి చిత్రాలు సాక్షాత్కరిస్తున్నాయి. ప్రస్తుతం జలాశయం సందర్శనకు వెళ్లినవారంతా వీటిని చూసి పులకించిపోతున్నారు. అలాగే మండపేట బైపాస్‌లో శనివారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తూ ప్రకృతి ప్రేమికులను ఇలా ఆహ్లాదపరిచాడు.. ఈ దృశ్యాలు శనివారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.

- మండపేట, మోతుగూడెం, (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యం

- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ
- ఐడీఎల్‌లో ముగిసిన జాతీయ స్థాయి సదస్సు

కాకినాడ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడీఎల్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి సదస్సు శనివారం సాయంత్రంతో ముగిసింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ విద్యార్థులు చదువును కేవలం ఉద్యోగాలుచేయడానికే కాదని, స్వయం ఉపాధి, వ్యాపార సంస్థలు నెలకొల్పడం మీదా దృష్టి కేంద్రీకరించాలన్నారు. కళాశాలల్లో విద్యార్థులకు భద్రత, వనరుల కల్పన కోసం తాను విద్యాశాఖ మంత్రికి తెలియజేశానన్నారు. జిల్లా పరిశ్రమల శాఖాధికారి సీహెచ్ గణపతి, జే.పాండురంగారావు, రామకృష్ణ, యమున, వీవీఎస్ఆర్, శివరామకృష్ణ తదితర ప్రొఫెసర్లు ప్రసంగించారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, గవర్నింగ్ బాడీ కార్యదర్శి పీఎస్‌కిరణ్, అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు ఎం.రంజిత్, కేఎస్ వాసు, ప్రిన్సిపాల్ టీ.సత్యనారాయణ, కన్వీనర్ స్టీవెన్‌రాజు, విభాగాధిపతులు ఈ.శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొనగా ఉపన్యాసకులకు, విద్యార్థులకు సర్టిఫికెట్లను అతిథుల చేతులమీదుగా అందజేశారు.



రూరల్ ఎమ్మెల్యే నానాజీని సత్కరిస్తున్న అతిథులు, డైరెక్టర్లు

జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్

- సివిల్ విభాగం ఆధ్వర్యంలో సొధ- 2 కే 25 పేరుతో నిర్వహణ



టెక్‌ఫెస్ట్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద్, అతిథులు

జేఎన్టీయూకే, మార్చి22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ (కే) వర్సిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సొధ- 2 కే 25 పేరుతో రెండురోజుల పాటు జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా కేఎస్‌పీఎల్ డీజీఎం పీ.రవికుమార్, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ విశిష్ట అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి, సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ స్టార్టప్‌లకు టెక్‌ఫెస్ట్‌లు మంచివేదికగా నిలుస్తాయన్నారు. దేశం మొత్తం మీద తొలుత ఇక్కడే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోర్టు కార్యకలాపాలను పర్యవేక్షించడం జరుగుతున్నదన్నారు. అనంతరం వీసీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ టెక్ ఫెస్ట్‌లు దోహదపడతాయన్నారు. వచ్చేఏడాదికి 1500 మంది సీటింగ్ సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆడిటోరియం అందుబాటులోకి రానుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రాజెక్టులు, వర్క్‌షాప్స్ పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, ఎగ్జిబిషన్స్‌ను ఉపకులపతి సందర్శించారు. విద్యార్థులకు డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్, టెక్నికల్ క్విజ్, తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎస్డీ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన హైడ్రో ఎలక్ట్రిక్ డ్యామ్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న వీసీ

గోవిందా... గోవింద

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.52.39 లక్షలు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరు మల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వి విధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.52,39,730 లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. మండువేసవిలో ఎండవేడిని సైతం లెక్కచేయకుండా స్వామివారి ప్రదక్షణలు ముగించుకుని గంటల తరబడి క్యూలైన్లలో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు స్పృహకోల్పోగా వైద్య సిబ్బంది సేవలు అందించారు.

కేశవస్వామిని దర్శించుకున్న ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్

పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ వైజాగ్ కె.మధుసూదన్ కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. తొలుతగా ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వాదం అందుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఇన్‌కం ట్యాక్సు కమిషనర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

సోమేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

రాయవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి వాయువ్యంలో చంద్రప్రతిష్ఠ శివాలయంగా పేరుగాంచిన మండలంలోని సోమేశ్వరం శ్రీబాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో సోమేశ్వరస్వామి, అమ్మవారిపై శనివారం సాయంత్రం సూర్యకిరణాలు నేరుగా తాకాయి. ప్రతిఏటా మార్చి నెలలో ఫాల్గుణమాసంలో ఒక్కరోజు స్వామి, అమ్మవారి మూలవిరాట్‌పై సూర్య కిరణాలు తాకుతూ ఉంటాయి. శనివారం సూర్యాస్తమయం సమయంలో సూర్యకిరణాలు సోమేశ్వరస్వామిని తాకడంతో ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు, హారతులు నిర్వహించారు. సోమేశ్వరం పరిసర ప్రాంతాల భక్తులు సోమేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



స్వామిని తాకిన సూర్య కిరణాలు

పరీక్షల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల పరిధిలోనే ఎక్కువ మంది పరీక్షలు రాస్తారని ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ అన్నారు. అందుకే పరీక్షల నిర్వహణపై కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీకళాశాలల్లో సోమవారం నుంచి డిగ్రీ, బీఈడీ, లా పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలను వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలం కావడంవల్ల తాగునీరు అందుబాటులో ఉంచాలని, కరెంటు సమస్య లేకుండా శుభ్రమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని యాజమాన్యాలకు సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని 109 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 22 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అలాగే బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల నిమిత్తం 20 కేంద్రాల్లో 2500 మంది, లా 8, 10 సెమిస్టర్ పరీక్షలకు మూడు కేంద్రాల్లో 500 మంది హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లను కళాశాలల నిర్వాహకులు పర్యవేక్షించాలని తెలిపారు.



పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించిన వీసీ ప్రసన్నశ్రీ

సత్యదేవా నర్సరీని సందర్శించిన మద్రాస్ హైకోర్టు జడ్జి

కడియం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) మద్రాస్ హైకోర్టు జడ్జి వి.శివజ్ఞానం శనివారం కడియపులంక పుల్లా అబ్బులు-సత్యదేవా నర్సరీని సందర్శించారు. అబ్బులు ఆగ్లోనిమా సిల్వర్ మొక్కను అందజేసి స్వాగతించారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్ మొక్కలను చూశారు. వాటి వివరాలు, శాస్త్రీయనామాలు, మొక్కల పెంపకంపై పుల్లా వీరబాబు, రాజశేఖర్ వివరించారు. వివిధ రకాల మొక్కలు ఒకే చోట చూడడం సంతోషంగా ఉందని జడ్జి శివజ్ఞానం అన్నారు.



మద్రాస్ హైకోర్టు జడ్జి శివజ్ఞానంకు మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

గోదావరి డెల్టాకు సీలేరు నుంచి నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలో వ్యవసాయ అవసరాల కోసం సీలేరు నుంచి బైపాస్ మార్గం ద్వారా మరో 1000క్యూసెక్కులు పెంచి 4వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 3వేల క్యూసెక్కులకుపైగా గోదావరికి విడుదల అవుతోంది. దీంతో గోదావరిలో నీటిలభ్యత 10,700 క్యూసెక్కులుగా నమోదయింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.తూర్పుడెల్టాకు 3200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2000 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదల అవుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9.85 నమోదైంది.

జీజీహెచ్‌లో రెండు జీబీఎస్ కేసులు

జీజీహెచ్(కాకినాడ), మార్చి (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవలకోసం ఇద్దరు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బాధితులు చేరినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ప్రస్తుతం ముగ్గురు బాధితులు చికిత్స పొందుతుండగా, ఇద్దరి చేరికతో మొత్తం ఐదుగురు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

ఏమి హాయిలే ఇలా...

- ఆ రహదారిపై ప్రయాణం కూల్ కూల్

రాజానగరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆ రహదారిలో ప్రయాణం హాయిగా సాగిపోతోంది. ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు ప్రయాణికులు మార్గమధ్యంలో ఆగి కొంచెంసేపు చెట్ల నీడన సేదతీరుతున్నారు. రాజానగరం-అనపర్తి ప్రధాన రహదారికి ఇరువైపులా ఫరిజెల్లిపేట సమీపంలోని రంగరాయ చెరువు వద్ద ఉన్న చెట్లు ఉష్ణతాపంతో అల్లాడుతున్న ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. వృక్షాలకు తోడు చెరువు నుంచి వీస్తున్న చల్లని గాలిలో ఏమి హాయిలే ఇలా అనుకుంటూ ఈ రోడ్డుపై వెళుతున్న వాహనదారులతోపాటు గ్రామానికి చెందిన వారు సైతం మధ్యాహ్నం సమయంలో ఇక్కడకు చేరుకుని కొంతసేపు విశ్రమించిన అనంతరం బయలుదేరుతున్నారు.



రాజానగరం-అనపర్తి ప్రధాన రహదారికి ఇరు వైపులా ఫరిజెల్లిపేట సమీపంలోని రంగరాయ చెరువు వద్ద చెట్లు నీడ

రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రంలో కిసాన్‌మేళా-2025

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సహకారాన్ని అందిస్తూ, రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిస్తున్నట్టు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు డాక్టర్ వైఎస్ఆర్ హెచ్‌యూ ఉద్యాన పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్‌మేళా-2025 నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డా.కె.గోపాల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతుల సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. వైస్ చాన్సలర్ డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యానపంటల ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు ఉద్యాన పంటల తోనే సాధ్యమన్నారు. విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా పరిశోధనా స్థానంలో అభివృద్ధి చేసిన యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ నిర్వహిస్తామన్నారు. కొవ్వూరు ఉద్యానవన పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.లలితా కామేశ్వరి మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో 13 లక్షల టిష్యూ కల్చర్ మొక్కలను అందజేశామన్నారు. ఈ మేళా 25లో ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ని పరిశోధనా కేంద్రాలు అంబాజీపేట, పందిరిమామిడి, పెద్దాపురం, కేవీకే వెంకట్రామన్నగూడెం, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వివిధ ప్రదర్శనలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, దా యన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, అక్షయపాత్ర రవీంద్ర, శాస్త్రవేత్తలు డీ. వెంకటస్వామి, ఏ.స్నేహలత రాణి, రైతులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

గౌరీపట్నంలో ప్రారంభమైన
నిర్మలగిరి మేరీ మాత మహోత్సవాలు


మేరీ మాత మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి జయరావు తదితరులు


నిర్మలగిరిలో ఆలయానికి విద్యుత్ అలంకరణ

దేవరపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీ మాత మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేరీమాత మహోత్సవాల సందర్భంగా ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుణ్యక్షేత్రం అఖండ దేవాలయంలో ఏర్పాటు చేసిన బైబిల్ ప్రదర్శనను తిలకించారు. నూతనంగా భక్తుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. నిర్మలగిరి మేరీ మాత మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యావత్ ప్రపంచం సుఖ శాంతులతో ఉండాలనేదే మేరీమాత తల్లి ఆకాంక్ష అని పేర్కొన్నారు. గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు గత 40 ఏళ్లుగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు ప్రేమ, దయ గుణం కలిగి ఉండాలన్నారు. సుఖజీవనం గడపాలని, సుఖశాంతులు అష్టఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థన లు చేయడం జరుగుతుందని తెలిపారు. మతాలు, ప్రాంతాలకతీతంగా ఈ ఉత్సవాలు నిర్వహించగా భక్తులు పాల్గొనడం ప్రత్యేకత అన్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, పాదర్లు బాల, ప్రసాద్, నిర్మలగిరి పుణ్యక్షేత్ర అన్నదాన కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు, పలువురు ఫాదర్లు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

రాజమహేంద్రవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, వాడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకూ ప్రభుత్వం పొడిగించిందని ప్రిన్సిపాల్ వి.ఆనంద్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అనుసరించి 40 సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా http://mjpapbcwreis. apcfss.in వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు

సామర్లకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట ఉండూరు రైల్వే గేట్ సమీపాన ఎన్‌ఎఫ్‌సీఎల్ పైప్‌లైన్ రోడులో ఆదివారం ఉదయం కుమార రామ భీమేశ్వరా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు జరుగనున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు చెప్పారు. వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్ పేరిట నిర్వహించనున్న ఈ పోటీలను మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) హాజరవుతారన్నారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు, షీల్డ్ బహుమతులు, జూనియర్స్‌లో మొదటి అయిదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 32 జతల ఎడ్లు సామర్లకోటకు చేరుకున్నట్టు తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఏడుగురిపై కేసు

గొల్లప్రోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేయడమే గాక ప్రశ్నించినందుకు తమపై దాడి చేశారని తాటిపర్తికి చెందిన పేకేటి ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై పాలికి సుబ్రహ్మణ్యం, బెందుకుర్తి డేవిడ్‌రాజు, బర్రె దుర్గాప్రసాద్, నాగేంద్ర, మరో ముగ్గురు మైనర్లపై కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఎవరెస్టు శిఖరం అధిరోహించడమే లక్ష్యం

భువనగిరిలో ట్రెక్కింగ్ శిక్షణ తీసుకున్న 14 ఏళ్ల అభిరాం


భువనగిరిలో శిక్షణలో భాగంగా ట్రెక్కింగ్ చేస్తున్న అభిరాం



మోతుగూడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న కొత్తపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ సోడే తిరుపతమ్మ, అప్పారావుల కుమారుడైన 14ఏళ్ల అభిరాం పర్వతారోహణపై మక్కువ పెంచుకున్నాడు. భవిష్యత్తులో ఎవరెస్టు శిఖరం అధిరోహించాలనేదే తన లక్ష్యమని తెలిపాడు. పర్వతారోహణపై మక్కువతో శిక్షణ తీసుకుంటున్నానని, ఆర్థిక సాయం అందితే కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహిస్తానని ధీమా వ్యక్తం చేశాడు. చింతూరులోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఎవరెస్టు అధిరోహించిన వీఆర్‌పురం మండలం కుంజవారిగూడెంకు చెందిన కుంజా దుర్గారావు స్ఫూర్తి, సూచనలతో అభిరాం కిలిమంజారో పర్వతం ఎక్కాలనుకున్నాడు. అతడి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఈ నెల 14నుంచి 16 వరకు తెలంగాణలోని భువనగిరిలో ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇప్పించారు. కిలిమంజారో అధిరోహణ ఆర్థికభారంతో కూడుకోవడంతో వారు బుధవారం ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను ఆశ్రయించి తమ కుమారుడి ఆశ నెరవేర్చేందుకు ఐటీడీఏ నుంచి ఆర్థిక సాయం చేయాలని కోరారు. స్పందించిన పీవో ముందుగా అభిరాంకు పాస్‌పోర్టు చేయించాలని, ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు బాలుడి తల్లిదండ్రులు తెలిపారు.

అన్నవరం దేవస్థానంలో
లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

అధిక ధరలకు విక్రయిస్తున్న 9మంది వర్తకులపై కేసులు


తనిఖీలు నిర్వహిస్తున్న మెట్రాలజీ అధికారులు

అన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో వివిధ లైసెన్స్‌లు కలిగిన వర్తకసంస్థలపై శనివారం జిల్లా వినియోగదారుల ఫోరం ఆదేశాలు మేరకు 9మంది వర్తకులపై కేసులు నమోదు చేసినట్టు లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు యస్.జనార్ధన రావు తెలిపారు. వారిలో ఎమ్మార్పీ ధరల కంటే షాపులలో రూ.5 నుంచి 20 వరకు అధికంగా విక్రయిస్తున్నట్టు గుర్తించామని.. వర్తకులపై లీగల్ మెట్రాలజీ 2009, లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్ కమోడిటీస్ నియమావళి 2011 ఉల్లంఘనలు కింద కేసులు నమోదుచేయడం జరిగిందని పేర్కొన్నారు. దాడుల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు సలీం, సరోజినీ, వివిఎస్ వివిఎస్.మోహన్, ఎస్.నాగేంద్రకుమార్, కొమ్మూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రిజిస్ట్రార్‌శాఖ ఉమ్మడి జిల్లా డీఐజీ వెంకటేశ్వరరావు


మండపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఐజీ వెంకటేశ్వరరావు

మండపేట మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రిజిస్ట్రార్‌శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీఐజీ ఎల్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కోనసీమ జిల్లా మండపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఫిబ్రవరి 22న వేళకు రిజిస్ట్రార్ రాకపోవడంతో కక్షిదారులు తాళం వేసిన సంఘటనపై శనివారం ఆయన విచారణ చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన పోతురాజు సునీత ఫిబ్రవరి 22న మధ్యాహ్నం వరకు కార్యాలయానికి రాకపోవడంతో రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న కక్షిదారులు వేళకు రానపుడు కార్యాలయం ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేసి కార్యాలయానికి తాళాలు వేయించారు. ఆ రోజు విధులకు అలస్యంగా హాజరైన సునీతను శనివారం పిలిపించి విచారణ చేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. కక్షిదారులకు ఇబ్బందులు కలిగించే చర్యలపై ఉపేక్షించేదిలేదని ఆయన హెచ్చరించారు.

వైభవంగా నూకాలమ్మ గరగల మహోత్సవం

పాల్గొన్న జబర్దస్త్ నటుడు దొరబాబు

అన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్యరోజున జరిగే మండపం నూకాలమ్మను జాతర పురస్కరించుకుని శనివారం కాకినాడ జిల్లా అన్నవరంలో గరగల మహోత్సవం మహిళలు, యువకుల కేరింతల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మండపం గ్రామం నుంచి 5కిలోమీటర్ల దూరం పూల గరగతో పాటుగా చిన్న గరగలతో నడిచి వచ్చారు. పూలగరగకు మహిళలు బిందెలతో నీళ్లుపోసి పసుపు, కుంకుమలు పూసి సారె, చీరలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు రావిచెట్టు సెంటర్‌లో గరగల మహోత్సవం జరిగింది. మండపం నూకాలమ్మ అన్నవరం అత్తివారి ఆడపడుచుగా పూజలందుకోవడంతో ముందుగా వారింటికి చేరుకుని అక్కడ పాన్పు అనంతరం నైవేద్యాలు సమర్పించారు. 2గంటల నుంచి సాయంత్రం 4 వరకు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గరగల సంబరం జరిగింది. జబర్దస్త్ నటుడు దొరబాబు పాల్గొన్నారు.


గరగల మహోత్సవంలో పాల్గొన్న జబర్దస్త్ నటుడు దొరబాబు, గ్రామస్థులు

మహనీయుల విగ్రహాలకు అవమానం

- దూబచర్లలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- రాస్తారోకో నిర్వహించిన అంబేడ్కర్‌వాదులు, మాల మహానాడు నేతలు
- రంగంలోకి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్
- భారీ ఎత్తున పోలీసుల మోహరింపు


దూబచర్ల గాంధీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దృశ్యం


రాస్తారోకో నిర్వహిస్తున్న మాల మహానాడు నేతలు

నల్లజర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామ పంచాయితీ పరిధిలోని గాంధీ కాలనీలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియన వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశారు. శనివారం ఉదయం చూసిన స్థానికులు మండలంలోని అంబేడ్కర్‌వాదులు, మాల మహానాడు నేతలకు సమాచారం తెలపడంతో వారు భారీ ఎత్తున తరలివచ్చి రాస్తారోకో నిర్వహించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న అదనపు ఎస్పీ సుబ్బారాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సిబ్బందితో హుటాహుటిన చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సంఘటనా స్థలానికి వచ్చి అంబేడ్కర్‌ను అవమానపరిచిన దోషులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. రాస్తారోకో చేస్తున్న వారితో కలిసి రోడ్డుపై కూర్చుని సంఘీభావం తెలిపారు. ఈ విషయంపై మాజీ హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని చెప్పుల దండతో అవమానపర్చారని, అక్కడ నూతన విగ్రహం ఏర్పాటు చేసి పైన షెల్టర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే తామే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డీఎస్పీకి వినతి పత్రం అందించారు. గోపాలపురం జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణ రాజు మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించి శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. డీఎస్పీ, సీసీఎస్ సీఐ అనుకూరి శ్రీనివాస్, దేవరపల్లి సీఐ బియస్ నాయక్, నల్లజర్ల సీఐ విజయశంకర్ అంబేడ్కర్‌వాదులతో చర్చలు జరిపి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బోడిగడ్ల వెంకటేశ్వరరావు, కూరపాటి శ్రీను, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు పిల్లి కాంతరావు, గుదే సుబ్బారావు, బొడిగడ్ల రాంబాబు, శ్రీరాములు, ఆదినారాయణ, కీర్తి రాజు పాల్గొన్నారు.

ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ

పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, సర్పంచ్ శారదాదేవి

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి అవమానం జరిగింది. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేశారు. ఉదయం చూసిన గ్రామస్థులు, టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెంటనే స్పందించి ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. గ్రామంలో గంజాయి బ్యాచ్ ఎక్కువగా ఉందని, మోటార్ వైర్లు, కోడిపుంజుల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిపై దృష్టి పెట్టాలని అక్కడకు వచ్చిన పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి శారదదేవి, రామకృష్ణ, కాకర్ల శేషగిరి, బొలుసు గంగరాజు, బొలుసు సుబ్బారావు, అయినపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన కృష్ణ

గండేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గండేపల్లికి చెందిన దోనాదుల కృష్ణ(50) మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కృష్ణ హైవే మెయింటిన్స్‌లో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం జాతీయ రహదారిపై వ్యాన్ నిలుపుదల చేసి సేఫ్టీ కోన్లు పెడుతుండగా వెనుక వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో వ్యాన్, లారీకి మధ్యలో ఉండిపోయి కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. కృష్ణకు అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై ఆందోళన..

హైవే అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని మురారి, గండేపల్లి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కృష్ణ మరణంపై స్పందించి న్యాయం చేయాలంటూ ఆయన కుటుంబీకులు, గ్రామస్తులు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. రహదారి శుభ్రపరిచేందుకు కొద్దిపాటి స్థలంలో కోన్లు ఏర్పాటు చేయాలని కాని రెండు కిలోమీటర్ల మేర ఎటువంటి పని లేకపోయిన కోన్లు ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల ఎంతో మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అనపర్తి ఎర్రకాలువలో యువకుడి గల్లంతు


శివకుమార్ (ఫైల్)

అనపర్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి ఎర్రకాలువలో శనివారం చినపొలమూరు గ్రామానికి చెందిన యువకుడు గల్లంతయ్యాడు. ఎస్‌ఐ శ్రీను నాయక్ వివరాల ప్రకారం.. చినపొలమూరుకు చెందిన కడియాల శివకుమార్(29) శనివారం ఉదయం అనపర్తి పని నిమిత్తం వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో కాలువలోకి దిగి ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు వచ్చి రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే శివకుమార్ కాలువలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అక్కడికి చేరుకుని పోలీసులకు, ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో వారు గాలింపు చర్యలు చేపట్టారు. పొద్దుపోయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో గాలింపు నిలుపుదల చేశారు. శివకుమార్ తండ్రి రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అయినవాళ్లందరూ దూరమై.. ఒంటరి బతుకు భారమై...

తుల్యభాగ డ్రైన్‌లో దూకి మహిళ ఆత్మహత్య


మృతురాలు లక్ష్మి

కరప, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కట్టుకున్నవాడు, కన్నకొడుకులు, అల్లుడు.. ఇలా ఒక్కొక్కరిగా కడతేరిపోతుండడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఒక మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేళంగి ధళమ్మచెరువుగట్టుకు చెందిన బరగాటి లక్ష్మి(59)కి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె సంతానం. వృత్తిరీత్యా పిల్లలందరూ వేర్వేరు గ్రామాల్లో ఉంటున్నారు. అయితే 2019లో లక్ష్మి భర్త సూర్యనారాయణమూర్తి, 2021లో చిన్న కొడుకు, 2023లో పెద్దకొడుకు, 5నెలల క్రితం అల్లుడు అనారోగ్యాలతో మృతి చెందారు. అయినవాళ్లందరూ ఇలా వరుసగా కళ్లముందే కన్నుమూయడంతో లక్ష్మి తీవ్ర మనోవేదనతో బ్రతుకీడుస్తుంది. ఒక్కగానొక్క కుమార్తె తల్లికి దూరంగా అనపర్తిలో ఉంటుండడంతో ఇక ఒంటరితనాన్ని ఎంతమాత్రం భరించలేని లక్ష్మి తనువు చాలించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో యండమూరు గ్రామానికి వెళ్లే దారిలో తుల్యభాగ డ్రైన్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం సాయంత్రం డ్రైన్‌లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చగా మృతురాలు లక్ష్మిగా నిర్ధారణ అయ్యింది. మృతురాలి మనవడు బరగాటి పోతురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తోట సునీత తెలిపారు.

కుందేలును మింగి.. ప్రహరీ గోడ భాగంలో చిక్కి!

పవర్ ప్లాంట్‌లో కొండచిలువ హల్‌చల్



కుందేలును మింగి కదలేని స్థితిలో ఉన్న కొండచిలువ

గోకవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం బావాజీ పేట గ్రామ సమీపంలో పోలవరం కాలువ గట్టుపై ఉన్న పవర్ ప్లాంట్‌లో శనివారం కొండ చిలువ హల్‌చల్ చేసింది. విధుల్లో ఉన్న ప్లాంట్ సిబ్బందికి కొండ చిలువ కనబడడంతో ఆందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారి భాస్కర్ కృష్ణ, సిబ్బంది ప్లాంట్ వద్దకు చేరుకుని కొండచిలువను గమనించి స్నేక్ క్యాచర్‌ను రప్పించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన స్నేక్ క్యాచర్ గంట సేపు శ్రమించి కొండ చిలువను పట్టుకున్నారు. అయితే అప్పటికే కొండ చిలువ కుందేలును మింగి ఉండడంతో కదలలేక ప్లాంట్ ప్రహరీ గోడ అడుగు భాగంలో చిక్కుకుంది. చివరికి కొండ చిలువను పట్టుకుని దేవీపట్నం మండలం దండంగి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో వదిలేశారు.

ఇద్దరు మైనర్లపై అత్యాచారయత్నం

దేహశుద్ధి చేసిన స్థానికులు

పెద్దాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మైనర్లపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెద్దాపురంలో వ్యాపారం చేసుకుంటున్న కామేశ్వరరావు శనివారం 2వ, 7వతరగతి చదువుతున్న ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. బాలికల అరుపులతో అక్కడే ఉన్న స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీనిపై పెద్దాపురం ఎస్‌ఐ మౌనికను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గిరిజనుడి అనుమానాస్పద మృతి


ఆలస్యంగా వెలుగులోకి ఘటన

వై.రామవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం కె.యర్రగొండ గ్రామానికి చెందిన గిరిజనుడు మిరియాల సంకురుదొర (38) అనుమానాస్పదంగా మృతి చెందాడు. గురువారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంకురుదొర గురువారం వాడపల్లి సంతకు వెళ్లి వచ్చి సాయంత్రం కల్లు చెట్లకు వెళ్లాడు. అనంతరం గ్రామంలోకి వచ్చి శివారులో విగతజీవుడైన విషయం ఎవరికీ తెలియరాలేదని కుటుంబీకులు తెలిపారు. గ్రామస్తులు, కుటుంబీకులు మృతదేహాన్ని దహనం చేసేందుకు నిర్ణయించుకోగా పోలీసులకు సమాచారం అందడంతో శనివారం వై.రామవరం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి

కిర్లంపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా మండలంలో ముక్కొల్లు గ్రామానికి చెందిన అనపర్తి కృష్ణ (56) అనే కౌలు రైతు శనివారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి పొలం పనిచేస్తుండగా పాము కాటుకు గురై మృతిచెందినట్టు కిర్లంపూడి హెడ్‌కానిస్టేబుల్ ఎన్.వెంకటరమణ తెలిపారు. వివరాల ప్రకారం. ముక్కొల్లుకు చెందిన పోతాబత్తుల నందీశ్వరరావు అనే రైతు వద్ద కృష్ణ కౌలు భూమి తీసుకుని సాగు చేసుకుంటున్నాడు. శనివారం తెల్లవారుజామున 5గంటల సమయంలో పొలానికి వెళ్లి పనులు చేసుకుంటుండగా పాముకాటుకు గురయ్యాడు. చుట్టుపక్కల రైతులు గమనించి అతన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ తరలించారు. మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పేర్కొన్నారు.

యానాం సబ్‌జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారీ


పరారైన ఖైదీ వెంకటేశ్వరరావు

యానాం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యానాం సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. దాదాపు 25 అడుగుల ఎత్తున్న సబ్‌జైల్ ప్రహరి గోడ దూకి పరారయ్యాడు. యానాం కనకాలపేటకు చెందిన కే.వెంకటేశ్వరరావు ఓ చోరీ కేసులో శుక్రవారం అరెస్ట్ అయ్యాడు. ఈ కేసులో 6 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో శనివారం ఉదయం సబ్ జైలుకు తరలించగా మధ్యాహ్నం జైలు నుంచి పరారవ్వడం అధికారులను కంగుతినేలా చేసింది. అతడి కోసం యానాం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

25న డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా
రాజోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల25న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు తెలిపారు. కిమ్స్ కేఎల్ గ్రూపు ప్రైవేటు లిమిటెడ్, పేటీఎం సంస్థల ప్రతినిధులు మేళాకు హాజరవుతారన్నారు. 18నుంచి35ఏళ్లలోపు వారు అర్హులన్నారు.

13 ట్రాక్టర్లు స్వాధీనం
రాజోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి):జిల్లా గనులు భూగర్భశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుమతులు లేకుండా సోంపల్లిలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుపై శనివారం దాడులు నిర్వహించామని రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సుజాత తెలిపారు. 13 ట్రాక్టర్లు స్వాధీనం చేసుకుని, పోలీసులకు అప్పగించామన్నారు. మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

అంతర్వేది, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంక హైస్కూలులో ఏపీఎన్జీసీ స్టేట్ మోనిటరింగ్ అధికారి జి.ప్రభావతి ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని విద్యార్థులతో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం గురించి 1992 బ్రెజిల్‌లోని రియోడీజెనిరోలో పర్యావరణ పరిరక్షణపై ఏర్పాటుచేసిన సమావేశంలో యునిసెఫ్ షెడ్యూల్ 21లో మొట్టమొదటిగా ప్రతిపాదించారని, 1993 మార్చి 22న పరిశుభ్రమైన నీరు-పరిశుభ్రత అనే ఇతివృత్తాంతంగా మొట్టమొదటి జల దినోత్సవం జరిగిందని ఆమె తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఇపప్పటికే 2.2 బిలియన్ల మందికి పరిశుభ్రమైన తాగునీరు లేదని, 3.2 బిలియన్ల మందికి సురక్షితమైన పారిశుద్య సేవలు లేవన్నారు. వీటివల్ల టైఫాయిడ్, కలరా, డయేరియా వంటి వ్యాధులు సంభవించి ప్రతీ సంవత్సరం 2,57,400మంది మరణిస్తున్నారని సీఎన్‌వో అంచనా వేసిందని తెలిపారు. మన దేశంలో బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్‌తో సహా మరో 20నగరాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని నీతిఆయోగ్ నివేదిక తెలియచేసినట్టు ఆమె తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఈసంక్షోభాన్ని అధిగమించవచ్చునని తెలిపారు. అనంతరం విద్యార్థులు గ్రామస్తులతో కలిసి ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం జి.మల్లికార్జునరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంతర్వేది: సఖినేటిపల్లిలంకలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగు కళాశాలలో శనివారం ప్రపంచ జలదినోత్సవం జరిపారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నీటి ఆవశ్యకత, లభ్యతను వివరించారు. నీటి పొదుపుపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ఎన్ఎస్ఎస్ పీవో ఎం.వెంకటేశ్వరరావు, విద్యాశాఖాధికారిణి ఎస్.జయలక్ష్మి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నిండుశోకంతో ఇమామ్‌అలీ వర్ధంతి


అమలాపురం పీర్ల పంజాలో సందేశమిస్తున్న మౌలానా హైదరాలీ


మామిడికుదురు: నగరంలో గుమ్మటాన్ని ఊరేగిస్తున్న ముస్లింలు

అమలాపురం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): షియా ముస్లింల ఆరాధ్య దైవదూత మహ్మద్ ప్రవక్త అల్లుడైన హజరత్ ఇమామ్‌అలీ వర్ధంతిని శనివారం స్థానిక 12వవార్డులోని ముజాఫర్ సందులో ఆస్థానే అబ్బాషియా పీర్ల పంజాలో భక్తిశ్రద్ధలతో నిండు శోకంతో నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పీర్ల పంజాలో ఇమామ్ అలీ వర్ధంతి విశిష్టతను ఒడిశా మత గురువు మహ్మద్ హైదరాలీ వివరించారు. రంజాన్ మాసం 21వ రోజున అలీ స్వర్గస్తులైన రోజును పురస్కరించుకుని షియా ముస్లింలు పీర్ల పంజాకు హాజరై నివాళులర్పించారు. మసీదు అధ్యక్షుడు నిస్సార్‌హుస్సేన్, కార్యదర్శి కర్రార్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపవాస దీక్ష అనంతరం ప్రసాద వితరణ చేశారు. పలువురు మొక్కలు తీర్చుకున్నారు. ప్రపంచ శాంతిని కోరుతూ అల్లాను ప్రార్థించారు.

ఇమామ్ హజరత్ అలీకి అశ్రు నివాళి
మామిడికుదురు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ముస్లింల ప్రథమ ప్రవక్త ఇమామ్ హజరత్ అలీకి భక్తులు శనివారం కన్నీటి నివాళి అర్పించారు. ఇస్లాం మతస్తులు అమితంగా ఆరాధించే హజరత్‌అలీపై సంఘ విద్రోహశక్తులు ఆనాడు జరిపిన దాడిని తలచుకుంటూ ప్రతీ సంవత్సరం రంజాన్ మాసంలోని 21వ తేదీని షహదత్ (అమరత్వం పొందినరోజు)గాపాటిస్తారు. షహదత్‌ను పురస్కరించుకుని నగరంలోని మొల్లా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి పెదపంజీష వరకు మాతం నిర్వహిస్తూ ఊరేగింపు చేశారు.సర్కిల్‌ఫర్హత అలీబేగ్ ఆధ్వర్యంలో మర్షియా ఆలపించారు. పెదపంజీషలో షహదత్ మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు మెహదీఅసన్‌బెహెస్తి మజ్లిస్ ఆలపించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మొదటిప్రవక్తకునివాళులర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ హరీష్‌మాధుర్ పుట్టినరోజు వేడుకలు


ఎంపీ హరీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రమణబాబు


దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అమలాపురం లోక్‌సభ సభ్యుడు గంటి హరీష్ మాధుర్ పుట్టినరోజు వేడుకలు శనివారం అమలాపురంలో ఘనంగా నిర్వహించారు. అమలాపురం పట్టణంలోని ఎర్రవంతెన వద్ద ఎంపీ కార్యాలయం వద్ద వేడుకలు జరిగాయి. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు చిల్లా జగదీశ్వరి, మానేపల్లి అయ్యాజీవేమాలతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కిసాన్‌సంఘ నాయకుడు నల్లా పవన్‌కుమార్, పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది హరీష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కోనసీమ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పూలమాలలువేసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్చాలు అందజేసి కేక్‌లు కట్ చేయించారు. తొలుత గుర్రపు బగ్గీ మీద భారీ ఊరేగింపుగా ఎర్రవంతెన నుంచి పార్టీ కార్యాలయం వరకు అభిమానులు తోడ్కొని వెళ్లారు. మార్గమధ్యలో క్రేన్ల సాయంతో భారీ పూలమాలలు ఏర్పాటుచేసి ఘన స్వాగతం పలికారు. తీన్మార్ డప్పులతో సంబరాలు చేసుకున్నారు. జిల్లాలోని పలువురు అధికారులు, పోలీసు అధికారులు, టీడీపీ, జనసేన, కూటమి నేతలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు హరీష్ పుట్టినరోజు సందర్భంగా ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లను అందజేశారు. ఈసందర్భంగా బ్లడ్ డొనేషన్ క్యాంపులో యువత రక్తదానం చేశారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పుట్టినరోజు వేడుకలను ముమ్మిడివరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ ఆధ్వర్యంలో చెల్లి అశోక్ యువసేన ముమ్మిడివరంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే పేదలకు కూడా పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో గొల్లపల్లి గోపి, కాశి లాజర్, బూరుగు కల్యాణ్, జాగు సత్తిబాబు, బుల్లెట్ ప్రసాద్, నీతిపూడి వంశీ, జగడం సుబ్బారావు, యలమంచిలి రాజా, కాట్రు వెంకట్రావు, కొమ్మాబత్తుల అశోక్, కాట్రు చంటి, కాకర కిశోర్, బొక్కా అఖిల్, చెల్లూరి శ్యామ్, జనిపల్లి రాజేష్, దేవరపల్లి ప్రసాద్, పెయ్యల రాహుల్, కొండేపూడి సాయి, జగడం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఎంపీ హరీష్ మాధుర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, టీడీపీ శ్రేణులు కేక్‌కట్ చేసి అభిమానులకు పంచారు. అలాగే మధురపూడి విమానాశ్రయం వద్ద ఎంపీ హరీష్‌కు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు, నిమ్మకాయల శేషయ్యలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. టీడీపీ మండల కార్యదర్శి గుత్తుల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సర్పంచ్ బొండాడ నాగమణి, నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్య క్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, సంసాని పెద్దిరాజు, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, శేరు శ్రీనుబాబు, కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

రేపు న్యాయ అవగాహన సదస్సు
అమలాపురంటౌన్,మార్చి22(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఈనెల24వతేదీ 3 గంటలకు లీగల్ అవేర్నెస్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ వి.నరేష్ తెలిపారు.

3వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం



పి.గన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మూడు వేల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం ఎం.సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం రైతుసేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై డ్వాక్రా యానిమేటర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 91గ్రామాల్లో 181గ్రామసంఘాలు ద్వారా పీఎండీఎస్ (ప్రీ మూన్‌సూన్ డ్రై సోయింగ్) పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మరో 98గ్రామాల్లో పీఎండీఎస్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 188గ్రామ సంఘాలు ద్వారా 23వేల ఎకరాల్లో రైతులు పీఎండీఎస్ ద్వారా విత్తనాలు చల్లుతున్నారని చెప్పారు. పంట కోతకు వారం రోజులు ముందు 30రకాల అపరాల విత్తనాలు చల్లాలని, తద్వారా ఆదాయంతో పాటు భూమి సారవంతంగా మారుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి ఏ.కల్యాణ్ సూర్యకుమార్ మాట్లాడుతూ ప్రతీ రైతు ఆరోగ్యకర పంటలు పండించేలా అవగాహన కల్పించాలన్నారు. వెలుగు ఏపీఎం మురళీకృష్ణ, ఎన్ఎఫ్ఏ రాధిక, యూనిట్ ఇంచార్జ్ నారాయణ, ఐసీఆర్‌పీ సత్యనారాయణ, వెంకటలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్‌తో గ్రామానికి ఆదాయం
ఉప్పలగుప్తం, మార్చి22(ఆంధ్రజ్యోతి): వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుల వల్ల గ్రామాల పరిశుభ్రతతో పాటు పంచాయతీకి ఆదాయం లభిస్తుందని ఎంపీడీవో పీఆర్సీ రాజ్‌కుమార్ అన్నారు. గోపవరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును శనివారం పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి ప్రాజెక్టు నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.బాలబాలాజీ, భీమనపల్లి కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనిర్వహించిన ఆదరణ సభలను ఎంపీడీవో పరిశీలించారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు


బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. శనివారం సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరం అలంకరించి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వైనతేయ నదిలో భక్తులు స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ సత్యనారాయణరాజు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

దేవాంగ సత్రం గదులకు రూ.6లక్షలు అందజేత



అంతర్వేది, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మోరి గ్రామానికి చెందిన జాన భగవాన్-లక్ష్మీ దంపతుల కుమారుడు డాక్టర్ జాన సాయి శంకర్- లక్ష్మీప్రసన్న దంపతులు తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవాంగసత్రం గదుల కోసం రూ.6లక్షల చెక్కును శనివారం తిరుపతిలో సత్రం నిర్వాహకురాలు బొమ్మన దుర్గాప్రసాద్‌కు అందజేశారు. ఈసందర్భంగా దాతలను పలువురు అభినందించారు.

చెస్ పోటీల్లో సాత్విక్ ప్రతిభ
అమలాపురం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో జరిగిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో చదువుతోన్న ద్రాక్షారపు సాత్విక్ అద్భుత ప్రతిభ చాటి ప్రథమస్థానం సాధించాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కరాటం రవిసుధీర్, మురళీలు తెలిపారు. సాత్విక్‌ను కళాశాల ఛైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ జేవీజీ రామారావు, ఫణిశంకర్, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు అభినందించారు.

న్యాయ అవగాహన సదస్సు
రాజోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చింతలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజోలు జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు అధ్యక్షతన శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, మట్టా సురేష్‌కుమార్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు జి.రజిత, కార్యదర్శి కె.రజనీ, సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా సంఘాల యానిమేటర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ వద్ద చెత్త డంపింగ్‌పై ఆందోళన


ఆందోళనకారులతో చర్చిస్తున్న అధికారులు, పోలీసులు

యానాం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్ శివారు విద్యుత్‌సబ్‌స్టేషన్ (పవర్ గ్రిడ్) వద్ద డంపింగ్‌యార్డు ఏర్పాటుచేస్తే సహించేది లేదని స్థానిక ప్రజలు ఆందోళన చేపట్టారు. సబ్‌స్టేషన్ భూముల్లో ట్రాక్టర్లతో చెత్తను వేస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన చేశారు. డంపింగ్‌యార్డుకు తాము పూర్తిగా వ్యతిరేకమని అన్నారు. అక్కడకు వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకోవడంతో కొంత ఉధృక్త పరిస్థితి ఏర్పడింది. అయితే గ్రామస్తులకు అధికారులు, పోలీసులు సర్దిచెప్పడంతో ట్రాక్టర్లతో తెచ్చిన చెత్తను అక్కడ డంప్ చేశారు. మళ్లీ చెత్తను తీసుకువస్తే ఆందోళన చేపడతామని ప్రజలు హెచ్చారించారు.

ఖాళీలను క్లియర్ వెకెన్సీగా చూపరాదు
అమలాపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల కోసం అదనపు విద్యార్హతలకై స్టడీ లీవ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు పనిచేస్తున్న పోస్టులను బదిలీల నియంత్రణ చట్టంలో క్లియర్ వేకెన్సీలుగా చూపించడాన్ని ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం జిల్లాశాఖ తీవ్రంగా ఖండించింది. నడిపూడి డాబా గార్డెన్స్‌లోని సంఘ భవనంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో జిల్లాశాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రస్తుతం పనిచేస్తోన్న ఖాళీలను క్లియర్ వేకెన్సీగా చూపిస్తే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అవసరమైతే ఆయా పోస్టుల్లో ఎంటీఎస్ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. స్టడీ లీవ్ అనంతరం తిరిగి ఆయా పోస్టుల్లో చేరేలా మార్పు చేయాలని సమావేశం కోరింది. జిల్లా ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు గెడ్డంప్రదీప్, మంగం సుధాకర్, బీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో బహుళ ప్రయోజనాలు
ఐ.పోలవరం, మార్చి22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగం వల్ల అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆశించిన ఫలితాలు సాధించవచ్చని అఖినాలిస్టిక్స్ ట్రైనింగ్ కంపెనీ ఫౌండర్ పి.జానకి అన్నారు. జి.వేమవరంలో రైతు కొండమూరి విజయబాబు పొలంలో శనివారం డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా సంపద సృష్టితో పాటు ఉద్యోగ కల్పనపై అవగాహన కల్పించారు. డ్రోన్‌ల వినియోగంలో యువతకు ఉపాధి కల్పించవచ్చన్నారు. సర్పంచ్ నల్ల సుదర్శన్‌రావు, పెంట రవిప్రసాద్, మద్దింశెట్టిపురుషోత్తం పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ ప్రచార జాత
అమలాపురం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈనెల23 నుంచి ఏప్రిల్ 14 వరకు సీపీఐ ప్రచారజాత నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ పేర్కొన్నారు. సీపీఐ జిల్లా సమితి సమావేశం శనివారం కె.రామకృష్ణ అధ్యక్షతన అమలాపురం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ వర్ధంతి రోజున ప్రచారజాతను ప్రారంభించి అంబేడ్కర్ జయంతి వరకు దేశవ్యాప్తంగా యాత్ర సాగుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించాలని సభ్యులకు సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తదితరులు మాట్లాడారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ
అమలాపురం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో పదో తరగతితో పాటు ఆపై అర్హత కలిగిన అభ్యర్థులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. 18నుంచి 40ఏళ్ల నిరుద్యోగ యువతీయువకులు స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందవచ్చునన్నారు. అభ్యర్థులు ఆధార్, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ పనివేళల్లో సంప్రదించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. శిక్షణ తర్వాత అభ్యర్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు సెల్: 8328507473ని సంప్రదించాలన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం
అమలాపురం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సేవాసంస్థల కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా నూరవ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అమలాపురం శ్రీగోపాలకృష్ణగోఖలే పురపాలక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. జోనల్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ పర్యవేక్షణలో వైద్యశిబిరం జరిగింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, కౌన్సిలర్లు వాసర్ల లక్ష్మి, మట్టపర్తి నాగేంద్ర, ఎస్ఎంసీ ఛైర్మన్ మట్టపర్తి కిరణ్ పాల్గొన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో 20మంది వైద్యుల బృందం 180మందికి వివిధ విభాగాల్లో స్క్రీనింగ్ పరీక్షలుచేసి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ మురళీకృష్ణంరాజు, డాక్టర్ తేజ, డాక్టర్ సంతోష్, డాక్టర్ శృతి, డాక్టర్ పూజిత తదితరులు వైద్యసేవలు అందించగా హెచ్ఎం ఎస్.గంగరాజు, బీవీఎస్సీ పోలిశెట్టి, ఎం.అనూష తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ
పి.గన్నవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉడిమూడి శివారు ఆదిమూలం వారిపాలెంలో తాళం వేసి ఉన్న ఇంట్లో జరిగింది. గ్రామానికి చెందిన ఆదిమూలం రాజరాజేశ్వరి 15రోజులు క్రితం హైదరాబాదులో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లారు. గ్రామంలో ఉంటున్న సోదరుడు కొండ్రెడ్డి కాశీవిశ్వనాథం అప్పుడప్పుడు వచ్చి ఇంటిని చూసి వెళ్తుండేవాడు. అయితే శనివారం అనుమానం వచ్చి ఇంటి వెనుకకు వెళ్లిచూడగా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించాడు. ఐదు కాసుల బంగారు ఆభరణాలు, 300గ్రాములు వెండి నగలు గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడని పోలీసులకు సమాచారం అందించారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పూర్తి: జేసీ
అమలాపురం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం రబీ సీజన్‌ధాన్యం కొనుగోలుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలన్నారు. జిల్లాలో 307రైతు భరోసా కేంద్రాల ద్వారా గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2,24,415.160 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 39,180మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రూ.523.06 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.522.75కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. రూ.0.31కోట్లు రైతులకు చెల్లించేందుకు బ్యాంకులకు పంపించాలమని జేసీ తెలిపారు.

ఓఎన్జీసీ వద్ద 20వ రోజు నిరసన దీక్ష
అల్లవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామాభివృద్ధి, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, తీరప్రాంత రక్షణ, పర్యాటక కేంద్రం అభివృద్ధి వంటి డిమాండ్లపై ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తులు చేపట్టిన రిలే నిరసన దీక్షలు శనివారం 20వరోజుకు చేరింది. ఓఎన్జీసీ అధికారులు స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. దీక్షలో కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణ, మందపాటి రామకృష్ణ, గుండుమేను శ్రీనివాస్, పెమ్మాడి వెర్రియ్య, మల్లాడి మాణిక్యం, కామాడి గంగాభవానీతోపాటు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
అంబాజీపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆదరణ-3 పథకాన్ని బీసీ కులాల కులవృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సరోవరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో కులవృత్తిదారులకు అవసరమైన పనిముట్లు, యంత్రాల వివరాలు, కంపెనీ పేర్ల జాబితాను తయారుచేసి అందించాలన్నారు. రజక సంఘ నాయకులు నేదునూరి కళ్యాణ్, అధికారపు బాబ్జి, కమిడి అబ్బు, శాలివాహన సంఘ నాయకులు ఆదుర్తి నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పీఎండీఎస్ విత్తనాలతో భూమికి మేలు
అమలాపురం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్)లో భాగంగా 30రకాల విత్తనాలను కలిపి చల్లడం వల్ల భూమికి ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్ పేర్కొన్నారు. నల్లమిల్లిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో తొలుత 30రకాల విత్తనాలు కలిపే విధానాన్ని వివరించారు. ఆ విత్తనాలను భూమిలో చల్లడం వల్ల కర్బన శాతం పెరిగి భూమి గుల్లబారి నీటిని నిల్వ ఉంచుకునే శక్తిని నింపుకుంటుందని ఏవో తెలిపారు. ఏఈవో ప్రేమ్‌కుమార్, హేమలత, సూరిబాబు, మాజీ సర్పంచ్ బొక్కా ఆదినారాయణ, అప్పారి వెంకటరమణ, వాకపల్లి శ్రీను, బద్దే రామకృష్ణ, రమణాతి పల్లయ్యశెట్టి, కర్రి రాజు పాల్గొన్నారు.

'రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి'
అంబాజీపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి):తెల్లరేషన్‌కార్డు ఉన్నప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఇన్‌చార్జ్ తహశీల్దారు వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలో 19,152మంది రేషన్‌కార్డుదారులు ఉండగా ఇప్పటివరకు 80శాతం ఈకేవైసీ పూర్తికాగా మిగిలిన 20 శాతం పూర్తిచేయాలని అధికారులను, రేషన్‌డీలర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్‌కార్డు రద్దు అవుతుందన్నారు. ఈకేవైసీ నమోదుకు దగ్గరలోని రేషన్ డీలర్లను సంప్రదించాలని సూచించారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి
ముమ్మిడివరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న ఆశ వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ జిల్లాలోని ఆశ కార్యకర్తలంతా శనివారం ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఆశ నోడల్ ఆఫీసర్ పీబీఎల్ కుమారికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ఆశ వర్కర్లంతా ముమ్మిడివరం చేరుకుని జిల్లా యూనియన్ అధ్యక్షురాలు బి.ఎస్తేరురాణి, బి.ఈశ్వరి ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నోడల్ ఆఫీసర్‌కు అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని ఆశ కార్యకర్తలంతా పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు నాణ్యతతో చేయాలి
మామిడికుదురు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులను నాణ్యతతో పారదర్శకంగా చేపట్టాలని డ్వామా ఏపీడీ మల్లికార్జునరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని 60మంది మేట్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ మాట్లాడుతూ ప్రతీ కూలీకి వంద పనిదినాలు కల్పించాలని, రూ.300 కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏపీవో రమేష్‌బాబు, జేఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ
అంతర్వేది, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మోరిపోడు, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన రైతులకు విత్తనాలు పంపిణీ చేసినట్టు వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు తెలిపారు. 50శాతం రాయితీపై మినుములు, పెసలు రైతులకు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, రేఖూరి రాజేశ్వరి ఏసునరసింహరాజు, ఎంపీటీసీ సభ్యులు బళ్ల సుభాషిణి, రైతులు, వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం
పి.గన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం-అంబాజీపేట బీటీ రోడ్డు పనుల్లో భాగంగా పోతవరం వద్ద రోడ్డు పటిష్ట పనులు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణచక్రవర్తి తెలిపారు. ఈసందర్భంగా తాగునీటి పైపులు మార్పు చేస్తున్నామన్నారు. దీంతో నాలుగు రోజులు పి.గన్నవరం, లంకలగన్నవరం, వైపీపాలెం గ్రామాలకు తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. ట్యాంకుల ద్వారా మంచినీటిని సరఫరా చేసుకోవాలని కార్యదర్శులకు సూచించామన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ
ఐ.పోలవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. వీరేశ్వరస్వామి ఆలయంలో దైవ సంబంధిత పాటలు, మంత్రాలు వినిపించేందుకు మైక్ ఏర్పాటు చేశారు. నిత్యం ఆలయంలో దైవ సంబంధిత పాటలు, మంత్రాలు ఆడియో రూపంలో ప్రతిధ్వనించాలని ఆదేశాలిచ్చారు. శనివారం వీరేశ్వరాలయంలో ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయంవద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ఓం నమఃశివాయ మంత్రం ప్రతిధ్వనించే ఏర్పాట్లు చేశారు. స్వల్ప వ్యయంతో టైమర్ ఏర్పాటుచేశారు. దీనిద్వారా నిర్దేశిత సమయానికి మంత్రం మైక్ ద్వారా ధ్వనిస్తుంది. ఈవిధానానికి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని ఆలయాల్లోనూ ఈవిధానం ప్రవేశపెట్టాలని కోరుతున్నారు.

విశ్వవిద్యాలయం టాపర్‌గా హేమవిజిత
అమలాపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వైద్య శాస్త్రానికి సంబంధించి ఎనస్థీషియా విభాగంలో పీజీ చదివిన అమలాపురం రూరల్ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ కరాటం హేమవిజిత గీతం యూనివర్శిటీ టాపర్‌గా నిలిచిందని తండ్రి, శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు తెలిపారు. శనివారం గీతం యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో హేమవిజితకు ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీఎంఆర్ ఫార్మర్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ బలరామ్‌భార్గవ చేతులమీదుగా స్వర్ణ పతకంతో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈసందర్భంగా వైస్‌చాన్సలర్ డాక్టర్ బీగీతాంజలి, మరోఅతిథి ఎంపీ ఎం.శ్రీభరత్‌లు హేమవిజితను అభినందించారు. వెంకటేశ్వరా కళాశాలలో ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ మనోహర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కరాటం ప్రవీణ్, శ్రావణ్‌దిలీప్, కె.పద్మావతి, వై.వరప్రసాద్, సౌందర్య, డాక్టర్ ఎం.శ్రీరామ్, ఎం.విజయలక్ష్మి తదితరులు హేమవిజితకు శుభాకాంక్షలు తెలిపారు.

13న గురుకుల పాఠశాలలో ప్రవేశానికి పరీక్షలు
రాజోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ గురు కులాల బాలుర, బాలికల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పరీక్షలు ముందుగా ప్రకటించిన ఏప్రిల్ 6న కాకుండా ఏప్రిల్ 13వతేదీన జరుగుతాయని శివకోటి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. 5వతరగతి ప్రవేశ పరీక్ష ఉదయం, ఇంటర్ ప్రవేశపరీక్ష మధ్యాహ్నం నిర్వహిస్తామన్నారు.

భార్య మందలించిందని దాడి
అమలాపురం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భార్య మందలించిందని అత్తంటివారిపై దాడిచేసిన ఘటనలో వేముల ప్రసాద్‌పై కేసు నమోదుచేసినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం ఉప్పర్ల కాలనీకి చెందిన వేముల ప్రసాద్ కొంతకాలంగా పనికి వెళ్లడం లేదు. దానికితోడు మోటారు సైకిల్‌కు ఫైనాన్స్ చెల్లించకపోవడంతో భార్య శనివారం మందలించింది. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ భార్యతో పాటు అత్తమామలు, మరదలిపై దాడిచేసి గాయపరిచాడు. గాయపడ్డ వారిని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సీఐ తెలిపారు. అత్తింటివారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

భక్తుల రద్దీని పరిశీలించిన డీఎస్పీ

ఆత్రేయపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని భకుల సౌకర్యాలపై పోలీస్‌శాఖ దృష్టిసారించింది. ఇందులో భాగంగా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్రంలో పర్యటించారు. క్యూలైన్ల పరిశీలన, పార్కింగ్ సౌకర్యం, అన్నప్రసాదం వద్ద ఏర్పాట్లు, ప్రదక్షిణలు చేసే భక్తుల రద్దీని పరిశీలించారు. వాటికి అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో చర్చించారు. పోలీస్, ప్రైవేట్ సెక్యూరిటీని పెంచడంతో పాటు మరిన్ని క్యూలైన్లు విస్తరించాలని నిర్ణయించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న డీఎస్పీ ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆయనకు స్వామివారి చిత్రపటం అందించారు. డీఎస్పీ వెంట సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి

ద్రాక్షారామ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మహిళలు అప్రమత్తంగా మెలగాలని రామచంద్రపురం 13వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శంకరరావు అన్నారు. శనివారం రామచంద్రపురం మండలం ఉండూరులో సచివాలయం వద్ద లోక్ అదాలత్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడారు. బాలికలు ఆకర్షణలోపడి అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి రక్షణకు ఫోక్సో చట్టాన్ని ఏర్పాటు చేశారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదుదారుడు కేసు నిరూపించాల్సి ఉంటుందని, ఫోక్సో కేసుల్లో నిందితుడు నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, ప్యానల్ లాయర్లు సన్నపు బాల సుబ్రహ్మణ్యం కుమారస్వామి, డి.సత్యనారాయణ, బండి శ్రీనివాస్, చింతపల్లి శ్రీను, పంచాయతీ విస్తరణాధికారి సెలెక్ట్ రాజు, ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి

కమిషనర్ రంగారావు



పట్టణంలో పర్యటిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆస్తి, ఇంటి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు కోరారు. మండపేటలో శనివారం ఆయన రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలిసి పన్నుల వసూళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది పన్నులు చెల్లింపునకు సంబంధించి ఎటువంటి రాయితీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు కౌంటర్లు పని చేస్తాయన్నారు. వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ కవర్లను వాడవద్దన్నారు. స్వచ్ఛ మండపేటకు సహకరించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు తదితరులు వున్నారు.

తడి,పొడి చెత్త సేకరణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి



పెదపళ్లలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీవో శాంతిలక్ష్మి

ఆలమూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణలో పారిశుధ్య కార్మికులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతిలక్ష్మి తెలిపారు. ఆలమూరు మండలం పెదపళ్లలో శనివారం ఆమె ఆకస్మిక తనిఖీలు జరిపారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం పెదపళ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామంలో జరుగుతున్న సర్వేలను ఆమె పరిశీలించారు. వ్యాపారులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణి, సర్పంచ్ యేడిద సత్యశ్రీ, నాయకులు సలాది నాగేశ్వరరావు, యేడిద మెహర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు స్వీయరక్షణ ఎంతో అవసరం

కె.గంగవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో ఆడపిల్లలకు కరాటే వంటి విద్యలు ఎంతో ఉపయోగపడతాయని పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీ బాషా అన్నారు. శనివారం గంగవరంలో ఆయన బాలబాలికలకు కరాటే మాస్టర్‌తో సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్‌పై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న అత్యాచారాలు, దారుణాలను వివరించారు. ముందుగా బాలబాలికలకు ఆపద సమయంలో ఎలా తమను రక్షించుకోవాలో తెలిపారు. ఆయన స్వయంగా ఆత్మరక్షణ విద్యలో కొన్ని టెక్నిక్‌లను పిల్లలకు నేర్పించారు.



గంగవరంలో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ చెబుతున్న ఎస్ఐ జానీబాషా

విద్యార్థినులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి

మండపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి) విద్యార్థి దశ నుంచే విద్యార్థినీ, విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని పట్టణ సీఐ దారం సురేష్ అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సెల్ఫ్ డిఫెన్స్ అవసరం ఎంతయినా ఉందన్నారు. పట్టణంలోని శశి హైస్కూల్లో శనివారం మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు గ్రాండ్ మాస్టర్ తాతపూడి అబ్బులు నేతృత్వంలో మహిళా స్వీయరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా మాస్టర్ ఆర్ట్స్ గురించి నేర్చుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. పట్టణ ఏఎస్ఐ చిన్నారావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి చదువులో మంచి ప్రయోజకులు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌ను వివరిస్తున్న సీఐ సురేష్

అయోడిన్ లోపంతో పలు అనర్థాలు

మండపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండాలంటే అయోడిన్ లోపం లేకుండా చూసుకోవాలని ఐడిజి కోనసీమ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. మండపేటలోని గొల్లపుంత టిడ్కో కాలనీలో శనివారం ఇనిస్టూట్ ఫర్ గ్లోబల్ డెవలప్ మెంట్ న్యూఢిల్లీ వారిచే అయోడిన్ లోపం వల్ల చిన్నపిల్లలకు కలిగే అనారోగ్యం గురించి వివరించారు. ఎస్.ఎస్.వీ.వీ. మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం లత మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఐడిజి సిబ్బంది లావణ్య, దివ్య, సునీత, కల్యాణి, సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అయోడిన్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం





ఆలమూరులో శిథిలావస్థకు చేరిన బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఇరిగేషన్ లాకు...వృధాగా పోతున్న సాగునీరు

శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోరా?

• ఆలమూరులో మరమ్మతులకు నోచుకోని బ్రిటీష్ కాలంనాటి ఇరిగేషన్ లాకులు • చోద్యం చూస్తున్న అధికారులు, పాలకులు

ఆలమూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వందేళ్ల క్రితం నిర్మించిన ఇరిగేషన్ కాలువల ద్వారా నేటికీ అవే లాకులు, కాలువలపై ఆధారపడి సాగు జరుగుతోంది. అయితే వాటికి కనీసం మరమ్మతులు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఆలమూరులో దశాబ్ద కాలంగా ఇరిగేషన్ లాకులను పట్టించుకోకపోవడంతో అవి పూర్తిగా దెబ్బతింటున్నాయి. వాటి తలుపులు పాడైపోవడంతో నీరు వృధాగా పోతోంది. పంట భూములకు లాకులపై నీటిని నిల్వ చేసి కాలువ చివర భూములకు సాగునీరు అందించేందుకు వంతుల వారీ విధానానికి తూట్లు పడుతోంది. నీటి నిల్వ చేయడానికి లాకుల తలుపులు పూర్తిగా చెడిపోవడంతో నీరు వృధాగా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సుమారు రెండున్నర ఏళ్ల క్రితం ఆలమూరు లాకుల వద్ద ఉన్న నేవిగేషన్ వ్యవస్థ మార్గంలో బ్రిటీష్ కాలం నాటి భారీ గోడలు కుప్పకూలాయి. నేవిగేషన్ వద్ద ఉన్న గేట్లు తుప్పుపట్టడంతో నీరు వృధాగా పోతోంది. వేలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సిన లాకుల పరిస్థితిని అటు ఇరిగేషన్ అధికారులు అటు పాలకులు కనీసం పట్టించుకోకపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలమూరు లాకుల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సురేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

నీటి సంఘం అధ్యక్షుడి మృతికి మంత్రి సుభాష్ సంతాపం

ద్రాక్షారామ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందిన వెలంపాలెం నీటి సంఘం అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు వల్లూరి సురేష్ కుటుంబీకులను మంత్రి సుభాష్ శనివారం పరామర్శించారు. నెలపర్తిపాడులో వారి కుటుంబీకులను పరామర్శించిన అనంతరం సురేష్ చిత్రపటం వద్ద నివాళుర్పించారు. వారి కుటుంబీలకు మంత్రి ధైర్యం చెప్పారు. వారి కుటుంబీకులను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పరామర్శించారు.

సహజ ప్రసవాలు జరిగేలా చూడాలి

ద్రాక్షారామ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో సహజ ప్రసవాలు జరిగేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ అంబటి భవానీ అన్నారు. శనివారం రామచంద్రపురం మండలం వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీల సమావేశాలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగినందున విలేజ్ క్లినిక్‌లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశాల్లో సర్పంచ్‌లు వీరబోయిన సూరిబాబు, పిల్లి అచలరాజేశ్వరి, కొత్తపల్లి అరుణ, టేకుమూడి సుజాత, వైద్యులు వి.లక్ష్మీ ప్రసన్న, అలేఖ్య, ఎన్.ప్రశాంతి, సందీప్‌నాయుడు తదితరులతో పాటు మండల పరిషత్ పరిపాలన అధికారి సీహెచ్ సుబ్రహ్మణ్యం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మోడరన్ విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ 5వ సెమిస్టరు ఫలితాల్లో లయన్ జీవీ రావు మోడరన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. బీఎస్సీ విద్యార్థులు 28 మంది ఉత్తమ గ్రేడు పాయింట్లు సాధించారన్నారు. అభినందన సభలో విద్యార్థులను లయన్ జీవీ రావు, అధ్యాపకులు, అకడమిక్ డైరెక్టరు సాయిరామ్ చౌదరి అభినందించారు.

వెంటూరు వీఆర్ఏ మృతికి పలువురు సంతాపం

రాయవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న రామదాసు దుర్గారావు శుక్రవారం రాత్రి మృతి చెందారు. వీఆర్ఏ మృతదేహాన్ని తహశీల్దారు ఐవీ శెట్టి సందర్శించి నివాళులర్పించడంతో పాటు మట్టి ఖర్చుల కింద 10వేలు అందించారు. టీడీపీ రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాలదొర, ఆర్ఐ ధర్మేంద్ర, వీఆర్వోలు గోపాలకృష్ణ, శ్రీలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.



స్వర్ణాంధ్ర రామిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్‌కుమార్ దంపతులు

ఎమ్మెల్సీ శ్రవణ్‌ను కలిసిన రామిరెడ్డి

రావులపాలెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రావులపాలానికి చెందిన స్వర్ణాంధ్ర రామిరెడ్డి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్ దంపతులు, రామిరెడ్డి దంపతులను సత్కరించారు.

టెన్త్ సంస్కృత పరీక్షకు నూరుశాతం విద్యార్థుల హాజరు

మండపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షల్లో శనివారం జరిగిన సంస్కృత పరీక్షకు నూరుశాతం విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. మండపేట అర్బన్, రూరల్‌లో జరిగిన పరీక్షకు 381 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

కలుషిత మంచినీరు సరఫరాపై ఆగ్రహం

రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ శ్రీదేవి, కమిషనర్ అయ్యప్పనాయుడు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో కలుషిత మంచినీటి సరఫరాపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మున్సిపల్ డీఈఈ శ్రీకాంత్ మాట్లాడుతూ తాను వాటర్ ప్లాంటును ప్రతిరోజూ పరిశీలిస్తున్నానని అన్నారు. దీనిపై మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కెఎంఎంకె మస్తాన్ మాట్లాడుతూ గత సమావేశం అనంతరం కౌన్సిల్ సభ్యులు వెల్ల వాటర్ స్కీమ్ పరిశీలనకు వెళ్లారన్నారు. అక్కడ బూజులు పట్టి అధ్వాన్న పరిస్థితి నెలకొందన్నారు. ల్యాబ్‌లో పరికరాలు లేవని నీటి పరీక్షలు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై కౌన్సిలర్లు గుబ్బల గణ, విప్ వాడ్రేవు సాయిప్రసాద్, పెంటపాటి దేవి, వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ తదితరులు అధికారులను నిలదీశారు. వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ వార్డుల్లో రంగుమారిన నీళ్లు వస్తున్నాయని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని అన్నారు. నీటిలో ఆక్సిజన్ తగ్గడంతో రంగుమారినట్లు ఉంటుందని డీఈఈ చెప్పగా సభ్యులు మరింత మండిపడ్డారు. నిపుణుల కమిటీకి నివేదించాలని సాయిప్రసాద్ సూచించారు. ఎజెండాలో పొందుపరచిన మొదటి అంశంలో మోటారు కొనుగోలు చేస్తామని, సిల్క్ శాండ్ వేస్తామన్నారు. ఉన్న తాదికారులకు నివేదిస్తామని డీఈ తెలిపారు. రక్షితనీటి పథకం వద్ద 1400 మొక్కలు నాటగా అందులో పోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటి కాంట్రాక్టరు పెంచాల్సి ఉందన్నారు. దీనిపై పర్యవేక్షణ చేయాలని సభ్యులు కోరారు. ఎజెండాలో 13వ అంశం వివిధ వార్డుల్లో చేపట్టిన 14 అభివృద్ధి పనులు నామినేషన్‌పై చేపట్టడాన్ని అధికార వైసీపీ కౌన్సిలర్లు తిరస్కరించారు. సమావేశంలో కౌన్సిలర్లు, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు ఉచిత చికిత్స

మంత్రి సుభాష్



కేన్సర్ రోగులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ రోగులకు గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో ఉచిత చికిత్స, మందులు అందిస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శనివారం రామచంద్రపురంలో మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద కేన్సర్ రోగులకు ఉచిత చికిత్స అందించేందుకు నమోదు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేన్సర్ రోగులు, బంధువులతో మాట్లాడారు. రోగుల ఆరోగ్య స్థితిని డాక్టర్ కోట సతీష్‌కుమార్ పరీక్షించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏటా కేన్సర్‌తో 70 వేల మంది చనిపోతున్నారని అన్నారు. ముందుగా పలు పరీక్షలు చేయించుకుని కేన్సర్ పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యాధి బాధితుల వివరాలు నమోదు చేసుకుని అవసరమైన వారికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున చైర్మన్ వాసంశెట్టి సత్యం మందులు అందించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



వాడపాలెంలో చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆపన్నులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుంటారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం వాడపాలెం పార్టీ కార్యాలయం వద్ద సుమారు 16 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6,95,680 చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలైన వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి కొంత ఊరటనిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సత్యశ్రీ రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ రిలే నిరాహార దీక్ష చేస్తున్న ప్రజలు

మద్యం దుకాణం వద్దంటూ ప్రజల నిరసన

మండపేట మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యశ్రీ రోడ్డులో గీత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన మద్యం దుకాణం ఏర్పాటును వార్డు ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో ఈ రోడ్డులో వున్న లయన్స్ క్లబ్ సమీపంలో దుకాణం ఏర్పాటు చేస్తుండగా స్థానికులు ఆందోళన జరిపారు. దీంతో మరో చోటుకు దాన్ని మార్పు చేశారు. ఇప్పుడు సప్తగిరి థియేటర్‌కు సమీపంలో ప్రైవేటు స్థలంలో గీత కార్మికులు మద్యం దుకాణం నిర్వహణ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో స్థానికులు అక్కడ మద్యం దుకాణం వద్దంటూ ఆందోళనకు దిగారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయటం వల్ల మూడు వార్డుల ప్రజలు ఇబ్బందులు పడతా రని వారంటు న్నారు. ఇక్కడ షాపు ఏర్పాటు తగదంటూ పట్టణంలోని 28, 29, 30 వార్డు ప్రజలు శనివారం నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి 28వ వార్డు కౌన్సిలర్, 29వ వార్డు పిల్లి శ్రీనివాస్ సారథ్యంలో నిరసన దీక్షలు చేపట్టారు.

వర్గీకరణ బిల్లు ఆమోదంపై సంబరాలు

కొత్తపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లు శాసనసభ, శాసన మండలిలో ఆమోదం లభించడంపై ఎంఆర్పీఎస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి అనంతరం కేక్‌కట్ చేసి బాణసంచాతో సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు కముజు శ్రీనివాసరావు, కముజు మోసేయ్, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎన్.ధనరాజు, యు.శ్రీనుబాబు, పెందుర్తి మోహనరావు, మడికి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఆర్డినెన్స్ బిల్లు ఆమోదించినందుకు మాదిగ దండోరా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. యండగండిలో దండోరా నాయకులు బాణసంచా కాల్చారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. వర్గీకరణకు కృషి చేసిన మందకృష్ణ మాదిగ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాధినేతలు ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో మాదిగ సంఘం నాయకులు పలివెల నాగేశ్వరరావు(శివరావు), పెందుర్తి అప్పన్న, దండోరా నాయకుడు పెందుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ద్రాక్షారామ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. మూడు రోజుల పాటు సీడీపీవో వీవీ వరహాలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. సరైన పోషణ, విద్య అందించేందుకు దీన్ని నిర్వహించారు.



శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆదాయం రూ.2.05 లక్షలు

కొత్తపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామి వారి సర్వ దర్శనాలు, తైలాభిషేకాలకు భక్తులు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్త జనం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కడా వారికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,05,305 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు జరిపారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న 10 మందికి సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి సుభాష్ శనివారం అందించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ద్రాక్షారామకు చెందిన కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావుకు రూ.3,43,796, రామచంద్రపురానికి చెందిన నేరెళ్ల జగదీష్‌కు రూ.1,53,930, గెద్దాడ వెంకటేశ్వరుకు రూ.1,12,320 తో పాటు మరో 7 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, సేలం వీరభద్రరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు చింతం మృతి

కొత్తపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలపాటు కొత్తపేట, రావులపాలెం మండలాల్లో ప్రముఖ దినపత్రికల జర్నలిస్టుగా సేవలందించిన చింతం వెంకటేశ్వరరావు (65) అనారోగ్యంతో శనివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతిపై పలువురు పాత్రికేయులతో పాటు ప్రముఖులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

రావులపాలెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఈతకోట జాతీయ రహదారి చెంతన ఉన్న కనకదుర్గమ్మ ఆలయ కల్యాణ మండపం అభివృద్ధికి కొత్తపేట నియోజకవర్గ రైస్ మిలర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు రూ.లక్ష విరాళం అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలిగొట్ల రామకృష్ణ, కమిటీ సభ్యులకు ఆయన విరాళాన్ని అందించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి సుభాష్ పరామర్శలు

కె.గంగవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంగేరు గ్రామంలో ఇటీవల మరణించిన ఒబిళినేని చిట్టమ్మ, పోలిశెట్టి వెంకమాంబ కుటుంబ సభ్యులను కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం పరామర్శించారు. మరణించిన వారి చిత్రపటా లకు నివాళులర్పించారు. ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలి పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రావిపాటి వెంకట గణేష్ చౌదరి, పి.సతీష్, మేడిశెట్టి పుణ్యమూర్తి, దంగేటి నాగేశ్వరరావు, ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు 1500 దరఖాస్తులు

కె.గంగవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలు పొందడానికి ఆన్‌లైన్‌లో 1500 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎంపీడీవో ఎన్. శ్రీనివాస రావు తెలిపారు. వీరిలో అర్హులను బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ఆయన చెప్పారు.

లిథియా ఫార్మసీ కాలేజీలో ఫ్రెషర్స్ డే

రావులపాలెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఈతకోటలోని బేథని విద్యా సంస్థల్లో ఉన్న లిథియా ఫార్మసీ కళాశాలలో సెక్రటరీ గొల్లపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే జరిపారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. నూతన సంవత్సరంలో అడుగుపెట్టిన విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అలవర్చుకోవాలని వక్తలు తెలిపారు.